# అగ్రనేత

తెలుగు దిన పత్రిక


TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :107 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 27-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## నారాయణపూర్‌లో ఎన్‌కౌంటర్..

ఛత్తీస్‌గఢ్ : మావోయిస్టులకు ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులకు కంచుకోట అయిన అబుజ్‌మడ్ ప్రాంతం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల అనంతరం ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.సంఘటనా స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్‌తో పాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రమాదం పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలోనే బలగాలు, మావోలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ప్రస్తుతం సంఘటనా స్థలంలో డీఆర్జీ నారాయణపూర్, కొండగావ్, ఎస్‌టీఎఫ్ అబుజ్‌మడ్ ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.ఇదిలా ఉండగా.. ఛత్తీస్‌గఢ్‌లో భారీగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. ఇటీవల కొంతకాలంగా వందలాది మంది మావోలు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు.

## భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని ఆపింది నేను.. మళ్లీ పాతపాటే పాడిన ట్రంప్



వాషింగ్టన్,భారత్-పాక్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధాన్ని ఆపింది తానేనని మరోసారి పునరుద్ఘాటించారు. రెండు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు కృషి చేసినట్లు చెప్పారు. ఒప్పందంలో అమెరికా ప్రమేయం లేదని భారత ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా ట్రంప్‌తోనే చెప్పినప్పటికీ అధ్యక్షుడి వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల పరిష్కారం తన ఘనతే అని పదేపదే ప్రకటించుకుంటున్నారు. తాజాగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం నిలిపివేస్తానని హెచ్చరించిన తర్వాతే ఈ యుద్ధం ఆగినట్లు ట్రంప్ తెలిపారు.నెదర్లాండ్స్ జరిగిన నాటో సదస్సులో విలేకరులతో ట్రంప్ మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం సహా ప్రపంచ వ్యాప్తంగా ఇటీవలే నెలకొన్న సైనిక సంఘర్షణలను ప్రస్తావించారు. అయితే, వాటన్నింటికంటే ముఖ్యమైనది భారత్-పాక్ వివాదం అని తెలిపారు. దాన్ని తాను ముగించగలిగానని చెప్పుకొచ్చారు. 'యుద్ధాలన్నింటిలో అతి ముఖ్యమైనది భారత్-పాక్ అంశం. దాన్ని నేను ఫోన్ కాల్స్‌తోనే ముగించగలిగాను. మీరు ఒకరితో ఒకరు పోరాడితే.. మేం ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకోమని చెప్పాను. దీంతో వారు మాతో వాణిజ్య ఒప్పందం కోరుకున్నారు. అందుకే యుద్ధాన్ని ఆపారు' అంటూ ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనకు గొప్ప మిత్రుడు అని ట్రంప్ తెలిపారు. అదే సమయంలో పాకిస్థాన్ జనరల్ అసీమ్ మునీర్ తనను చాలా ఆకట్టుకున్నట్లు ట్రంప్ వ్యాఖ్యానించారు.కాగా, ఈవివాదంపై ప్రధాని మోదీ.. స్వయంగా ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించదని స్పష్టం చేశారు. ఇందులో అమెరికా ప్రమేయం లేదని ట్రంప్‌కు తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. దాదాపు 35 నిమిషాల పాటూ ఇద్దరూ ఫోన్‌లో సంభాషించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ట్రంప్‌కు మోదీ వివరించినట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి మిలటరీ స్థాయి చర్చలు జరిగాయన్నారు. ఇతరుల మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడికి మోదీ స్పష్టంగా చెప్పినట్లు మిస్రీ వివరించారు.

## సంస్థగత ఎన్నికలతో పార్టీ ప్రక్షాళనకు రంగం సిద్ధం



హైదరాబాద్,ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, అభివృద్ధిఫలాలు, ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ఎలుగెత్తిచాటడంలో కార్యకర్తనే ముందుంటాడు. వారి నిర్ణయాలను పరిగణలోకి తీసుకుని పార్టీ సంస్థగత ఎన్నికల్లో పటిష్టమైన నాయకులను ఎన్నుకొని, స్థానిక ఎన్నికల సమరానికి వెళ్లాలనే యోచన..పార్టీ కోసం పనిచేసిన వారికి మాత్రమే పదవులు వరిస్తాయని మాటలు కాంగ్రెస్ క్షేత్ర స్థాయిలో కూడా అమలు చేసేందుకు తెలంగాణలో కార్యాచరణ రూపొందించింది. పార్టీ మనుగడకు పునాది రాళ్ళుగా నిలిచే కార్యకర్తలకు, నాయకులుగా ఎదిగేందుకు ఇది చక్కటి అవకాశం. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఈ ప్రక్రియతో పార్టీ మరింత బలపడుతుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, అభివృద్ధిఫలాలు, ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ఎలుగెత్తిచాటడంలో కార్యకర్తనే ముందుంటాడు. వారి నిర్ణయాలను పరిగణలోకి తీసుకుని పార్టీ సంస్థగత ఎన్నికల్లో పటిష్టమైన నాయకులను ఎన్నుకొని, స్థానిక ఎన్నికల సమరానికి వెళ్లాలనే యోచన మంచిఫలితాలు తెచ్చిపెడుతుందనడంలో సందేహం లేదు.గ్రామంలో సామాన్య కార్యకర్త నుంచి పీసీసీ అధ్యక్షులు, మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయి వరకు ఏ పదవి కావాలన్నా, ట్రాక్ రికార్డు ఖచ్చితంగా చూడాలని, పార్టీకి సేవ చేసిన, చేస్తున్న వారికి మాత్రమే పార్టీ, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, వారిని పార్టీ కార్యకర్తలు, ప్రజల సమక్షంలోనే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక చేయాలనే ఆలోచన సరికొత్త అధ్యాయానికి నాంది అని చెప్పుకోవచ్చు. దారిలో పోయే దానయ్యలను పిలిచి పార్టీ పగ్గాలు అప్పగిస్తే పార్టీకి నష్టం వస్తుందని అధిష్టానం గ్రహించింది. గ్రామస్థాయిలో బూత్ నాయకుడైన ప్రజలకు చేదోడు, వాదోడుగా నిలిచే వారు, మంచి, చెడ్డలు పట్టించుకునే వారు నాయకునిగా రూపుదిద్దుకుంటారు. వారికి పార్టీ అవకాశం కల్పించడం వల్ల మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు వీలుంటుంది. దీంతో ఆ నాయకుడు బలంగా ఉంటే క్షేత్ర స్థాయిలో పార్టీ బలపడుతుంది.బలమైన పునాదులు ఏర్పరచుకున్న ఏ పార్టీకి అయినా మనుగడకు ఢోకా లేదని చరిత్ర చెబుతున్నది. ఈ విషయంలో అధినాయకత్వం తీసుకునే నిర్ణయాలు తూచా తప్పకుండా శిరసావహిస్తూ పార్టీని ముందుకు నడపడంలో ప్రతీ కార్యకర్త తన బాధ్యతను గుర్తెరుగుతాడనేది నిర్వివాదాంశం. ఈ ఆలోచనలో శాస్త్రీయత కనిపిస్తోంది. ప్రజల గురించి, ఆయా గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకోకుండా, కేవలం కాంట్రాక్టులు, పైరవీల కోసం మాత్రమే తాపత్రయం పడే వాళ్లు నాయకులుగా ఎదగడం కష్టమే. వారికి పదవులు వస్తే ఏం చేస్తారో అందరికీ తెలిసిన విషయమే. వారివల్ల పార్టీకి దీర్ఘకాలంలో నష్టం వాటిల్లుతుంది. ఏ నాయకుడి వల్ల ప్రజా ప్రయోజనాలు చేకూరుతాయి అనే దానిని దృష్టిలో పెట్టుకొని, కార్యకర్తల సమక్షంలోనే, వారి సుముఖతతో బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి మంచిది.కార్యకర్త నుంచి నాయకులుగా ఎదిగిన వారందరూ ఆయా గ్రామాల్లో, మండలాల్లో ప్రజలకు చేరువగా ఉంటూ, వారి సమస్యలను తన స్థాయిలో పరిష్కరిస్తూ, వారిలో మమేకమై ఉన్నప్పుడే వారికి అవకాశాలు వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకొని మరింత సేవ చేసేందుకు ప్రయత్నించాలి. ప్రధానంగా ప్రభుత్వం లో ఉన్న పార్టీ ఇలాంటి విషయాలను పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరిస్తుంది. అధికారంలో ఉన్నాం, తాము ఏం చేసినా చెల్లుతుందని ధోరణితో ఉంటే పార్టీ మనుగడపై దీర్ఘకాలంలో ప్రభావం చూపుతుంది. పార్టీ పునాదులు కదులుతాయి.. మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రావడం కష్టసాధ్యం అవుతుంది. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే కిందిస్థాయి నుంచి ప్రక్షాళన అవసరమే. గ్రామాల్లో పార్టీ పేరు చెప్పుకొని, అధికారంలో ఈ పార్టీ ఉంటే ఆ పార్టీ మాదే అని రంగులు మార్చే పైరవీకారులు, కాంట్రాక్టర్లు, స్వయంప్రకటిత నాయకులుగా చలామణి అవుతున్న వారికి కాకుండా నిజమైన కార్యకర్తలకు అవకాశం వస్తుంది. ఈ ప్రక్రియ సజావుగా జరిగితే ఏ పార్టీకైనా మంచి భవిష్యత్ ఉంటుందనడంలో సందేహం లేదు.

## చైనా ముందే పాకిస్తాన్‌ను ఏకిపారేసిన రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ,చైనాలోని కింగ్‌డావోలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశానికి భారత్ తరఫున కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.అయితే, గల్వాన్ లోయలో జరిగిన ఘటన తర్వాత ఆయన బీజింగ్ లో పర్యటించడం ఇదే తొలిసారి. కాగా, భారతదేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న రాజ్‌నాథ్ సింగ్‌కు సమావేశ వేదిక దగ్గర డ్రాగన్ కంట్రీ రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇతర నాయకులతో కలిసి రాజ్ నాథ్ గ్రూప్ ఫోటో దిగారు. ఈ గ్రూప్ ఫోటో సెషన్ సమయంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కూడా అక్కడే ఉన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. చైనా ముందే పాకిస్తాన్ పై తీవ్రంగా మండిపడ్డారు. ఇస్లామాబాద్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుంది.. దాన్ని అరికట్టడానికి సరిహద్దు దాటిన టెర్రరిజాన్ని నిర్వీర్యం చేయడానికి మే 7వ తేదీన ఆపరేషన్ సింధూర్ చేపట్టామని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ.. తమపై తరుచూ దాడులకు పాల్పడుతున్న వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడనికి ఏమాత్రం వెనుకాడము అని తేల్చి చెప్పారు. మన యువతలో రాడికలైజేషన్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి మనం కూడా చురుకైన చర్యలు తీసుకోవాలి అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లించారు.ఇక, షాంఘై సహకార సంస్థలోని RATS యంత్రాంగం ఈ విషయంలో అద్భుతమైన పాత్ర పోషించింది అని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. అలాగే, భారతదేశం అధ్యక్షత వహించిన సమయంలో 'ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదానికి దారితీసే రాడికలైజేషన్‌ను ఎదుర్కోవడంపై ఎస్‌సీఓ దేశాధినేతల మండలి సంయుక్త ప్రకటన విడుదల చేయడం మన ఉమ్మడి నిబద్ధతకు ప్రతీక అన్నారు. మరోవైపు ఈ సమావేశం తర్వాత బీజింగ్ రక్షణ మంత్రి డాంగ్ జున్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించాలని రాజ్ నాథ్ సింగ్ యోచిస్తున్నారు. చైనా-భారత్ సైనిక హాట్‌లైన్‌ను తిరిగి ప్రారంభించడంపై దృష్టి పెట్టారు. దీంతో పాటు అంతర్జాతీయ శాంతిభద్రతలను కాపాడటానికి భారత్ తన వంతు ప్రయత్నం చేస్తుంది. అయితే, ఈ రోజు చైనా అధ్యక్షతన జరుగుతున్న సమావేశంలో భారత్, పాకిస్తాన్, ఇరాన్, కజకిస్తాన్, కిర్గిజ్స్తాన్, రష్యా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ వంటి సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి బిరుదు ఇవ్వాలి...



హైదరాబాద్,18 నెలల కాంగ్రెస్ పార్టీ పాలనలో రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత (కవిత). అయినా పెన్షన్లు, మహిళలకు00 ఇస్తామన్న రూ.25 ఇవ్వలేక పోతున్నారని. అప్పు కావాలని ఆర్‌పీసీ సంస్థకు రేవంత్ రెడ్డి లేఖ రాశారని చెప్పారు. ఆ లేఖలో కాళేశ్వర ప్రాజెక్టు గురించి చాలా గొప్పగా ఉండేదని. రేవంత్ రెడ్డి రాష్ట్రానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక పోతున్నాడని.కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మేఘా కృష్ణారెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారని చెప్పారు. రాష్ట్ర ఆదాయం ఎక్కడకి పోతుందో ప్రజలకు ముఖ్యమంత్రి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి బిరుదు ఇవ్వాలన్నారు. వాస్తవాలు లేకుండా తాను ఏది మాట్లాడనని చెప్పారు. రూ.2 లక్షల కోట్ల అప్పు దేనికి ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. భద్రాచలంలో రాముడు మునిగిపోతుంటే తెలంగాణలో ఉన్న బీజేపీ ఎంపీలకు చీమ కుట్టినట్లు కూడా లేదని తెలుస్తోంది. ప్రజా భవన్‌లో ఏపీ సీఎం చంద్రబాబుకు హైదరాబాద్ బిర్యానీ తినిపించి బనకచర్ల ప్రాజెక్ట్ కట్టుకోండి అని రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడన్నారు. కలలో కూడ తెలంగాణకు కేసీఆర్ అన్యాయం చేయాలని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ఇద్దరు ప్రజా భవన్‌లో కలిసినప్పుడే గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు రేవంత్ రెడ్డి కట్టబెట్టాడని.

## హిమాచల్‌ప్రదేశ్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు..



హిమాచల్‌ప్రదేశ్:హిమాచల్‌ప్రదేశ్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. ఇద్దరు మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారు. కాంగ్రా జిల్లాలోని మునని ఖాడ్‌లో ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.ఇక ఇందిరా ప్రియదర్శిని జల విద్యుత్ ప్రాజెక్ట్ స్థలం సమీపంలోని లేబర్ కాలనీలో ఉన్ 15-20 మంది కార్మికులు గల్లంతైనట్లుగా సమాచారం. ప్రాజెక్ట్ దగ్గర నీటి మట్టం పెరగడంతో కొట్టుకుపోయి ఉంటారని తెలుస్తోంది. వారి కోసం అధికారులు గాలిస్తున్నారు. బియాస్, సట్లెజ్ నదుల నీటి మట్టం పెరిగిందని అధికారులు చెప్పారు.వర్షాలు కారణంగా ప్రాజెక్ట్ పనులు నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. తాత్కాలిక ఆశ్రయాల్లో విశ్రాంతి తీసుకుంటుండగా హఠాత్తుగా వరద రావడంతో కార్మికులు కొట్టుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. కొంత మంది క్షేమంగా బయటపడినట్లు సమాచారం. ఈ ఘటనలో దాదాపు 20 మంది కార్మికులు గల్లంతయ్యారని ధర్మశాల బీజేపీ ఎమ్మెల్యే సుధీర్ శర్మ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రాష్ట్ర విపత్తు దళం, స్థానిక అధికారులు సంఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు.కులు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఇళ్లు, పాఠశాల భవనం, దుకాణాలు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నట్లుగా అధికారులు తెలిపారు. క్లౌడ్‌బర్స్ట్ కారణంగానే ఇంత పెద్ద ఎత్తున వరదలు సంభవించినట్లుగా తెలుస్తోంది.చంబా, కాంగ్రా, మండి, సిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో గురువారం సాయంత్రం వరకు వరద ప్రమాదం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక జూన్ 29 వరకు రాబోయే నాలుగు రోజుల్లో నాలుగు నుంచి ఏడు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వార్నింగ్ ఇచ్చింది.

## ఆ ఆసుపత్రుల్లోనే నగదు రహిత చికిత్స...



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రోడ్డు ప్రమాద బాధితులకు సంబందించి శుభవార్త చెప్పారు. ప్రమాదం జరిగిన వారంలోపు బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సౌకర్యం కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకం కింద పొందుపరిచిన చొప్పదండి, జగిత్యాల, మెదక్ తదితర జిల్లాల్లోని ఆసుపత్రుల్లో అందుబాటులోకి రానుంది. ఈ పథకంతో బాధితులు ఆసుపత్రిలో వైద్యం కోసం పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చుచేయాల్సిన అవసరం లేకుండా పోతుందని మంత్రి తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ ఆసుపత్రుల్లోనే వర్తింపు

ఈ పథకం కింద నగదు రహిత వైద్యం ఆయుష్మాన్ భారత్ పథకానికి అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు స్పందించాల్సిందిగా, అలాగే ఈ-దార్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని మంత్రి సూచించారు. సమాచారం నమోదైన వెంటనే బాధితులకు చికిత్స కోసం ప్రాసెస్ మొదలవుతుందని తెలిపారు. ఇందులో ప్రభుత్వంతోపాటు ప్రైవేటు ఆసుపత్రులు కూడా భాగస్వాములవుతాయని చెప్పారు.

## ఇరాన్ సుప్రీం లీడర్ ఎక్కడ.. వేరే దేశానికి మకాం మార్చే ఛాన్స్..?



టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రతరం అవుతున్నాయి. అయితే, ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రస్తుతం భద్రతా పరమైన ఆందోళనలను ఎదుర్కొంటున్నారు.ఇజ్రాయెల్‌తో తీవ్ర ఉద్రిక్తతల వేళా ఆయన భద్రత కోసం రహస్య బంకర్ లో తలదాచుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఖమేనీపై దాడి చేసేందుకు ఇజ్రాయెల్ ప్రణాళికలు రచిస్తోందన్న ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఆయన ప్రస్తుతం బహిరంగంగా కనిపించడం లేదు.అయితే, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తాత్కాలికంగా సీజ్ ఫైర్అమలులో ఉన్నప్పటికీ, ఖమేనీ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని సమాచారం. ఈ నేపథ్యంలోనే, విదేశీ ముఠాలు లేదా మోసాద్ లాంటి గూఢచార సంస్థలు ఆయనపై దాడికి సిద్ధమవుతున్నట్లు టెహ్రాన్ ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించినట్లు తెలుస్తుంది. ఈ పరిస్థితుల్లో అలీ ఖమేనీ మరో దేశానికి తాత్కాలికంగా వెళ్లి తలదాచుకోవాలని యోచిస్తున్నట్లు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ నివేదికలో పేర్కొంది. ఇది ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలకు దారి తీసే అవకాశం ఉంది.ఇక, అలీ ఖమేనీ వేరే దేశానికి వెళ్తే, అది ఇరాన్ రాజకీయ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ఛాన్స్ ఉంది. ఎందుకంటే, ఆయనే దేశంలోని అత్యున్నత అధికారి కావడం, అన్ని కీలక నిర్ణయాలపై నియంత్రణ కలిగి ఉండటంతో.. అతడి గైర్హాజరు రాజ్య పాలనలో తీవ్ర అస్థిరతకు దారి తీసే అవకాశం ఉంటుంది. ఇలాంటి, పరిస్థితుల్లో శత్రు దేశాలైన ఇజ్రాయెల్, అమెరికా మరింత బలంగా టెహ్రాన్ పై దూకుడుగా వ్యవహరించే ప్రమాదం ఏర్పాడే ఛాన్స్ ఉంటుంది.

## నాకు రాజ్యాంగమే సుప్రీం: సీజేఐ బీఆర్ గవాయ్



అమరావతి: తన వరకు రాజ్యాంగమే అత్యున్నతమైందని, ప్రజాస్వామ్యంలోని మూడు శాఖలు దాని కిందే పనిచేస్తాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. పార్లమెంట్‌కు సవరణలు చేసే అధికారం ఉందని, కానీ అది రాజ్యాంగంలోని మౌళిక అంశాలను మార్చలేదని అన్నారు. 52వ సీజేఐగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ గవాయ్.. మహారాష్ట్రలోని అమరావతి సిటీలో జరిగిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు.కొందరు పార్లమెంటే సుప్రీం అని చెబుతారని, కానీ తన అభిప్రాయంలో రాజ్యాంగమే పరమోన్నతమైందన్నారు. ప్రజాస్వామ్యంలోని ఎగ్జిక్యూటివ్, లెజిస్లేచర్, జుడిషియరీ వ్యవస్థల్లో ఏది మేటి అన్న చర్చ ఎప్పుడూ జరుగుతుందన్నారు. చాలా మంది పార్లమెంటే సుప్రీం అన్న అభిప్రాయాన్ని, విశ్వాసాన్ని వ్యక్తం చేస్తారని, కానీ తన వరకు రాజ్యాంగమే అత్యున్నతమైందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు జారీ చేస్తూ ఓ జడ్జీ వ్యక్తిగతంగా వ్యవహరించలేరన్నారు.తాము డ్యూటీలో ఉన్నామన్న విషయాన్ని ప్రతి జడ్జీ గుర్తుంచుకోవాలని, పౌరుల హక్కుల పట్ల.. రాజ్యాంగ విలువలు, సూత్రాల పట్ల రక్షకులమని ఆయన తెలిపారు. తమకు కేవలం అధికారం ఉండదని, కానీ దానిపై బాధ్యతాయుతమైన డ్యూటీ ఉందన్నారు. ప్రజలు ఏమనుకుంటున్నారు, తమ న్యాయం పట్ల ఎట్ల స్పందిస్తున్నారన్న ఆలోచన ఉండరాదన్నారు. వ్యక్తిగతంగా జడ్జీ ఆలోచించాలన్నారు, ప్రజలు చెప్పేది మన నిర్ణయాత్మక ఆలోచనల్లో భాగంగా కారాదన్నారు.


## సంపాదకీయం

శుక్రవారం 27-06-2025

# అఘాయిత్యాలు!


రాజ్యాంగంపై చేసిన ప్రమాణాన్ని తుంగలో తొక్కి మనువాదాన్ని భుజాన మోస్తున్న కమలం పార్టీ ఏలుబడిలో దళితులకు మిగిలింది అడుగడుగునా అవమానాలు, వేదనలే! బిజెపి డబుల్ ఇంజన్ సర్కారు ఉన్న రాష్ట్రాల్లో గూండాలు దారుణంగా పేట్రేగిపోతున్నారు. గత ఏడాది ఎన్నికల్లో బిజెపి తొలిసారిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒడిశాలో ఇటీవల అలాంటి ఘోరమే వెలుగుచూసింది. గంజాం జిల్లాలో ఆవు, రెండు దూడలను కొనుగోలు చేసి వాహనంలో వాటిని తీసుకెళ్తున్న ఇద్దరు దళితులను అడ్డగించి, వారి మొబైల్ ఫోన్లు, నగదు లాక్కుని, దాడి చేశారు. పశువులను విడిచిపెట్టడానికి రూ.30 వేలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. వారు నిరాకరించడంతో కట్టేసి, అరగుండు కొట్టించి, దాదాపు రెండు కిలోమీటర్లు రోడ్డుపై మోకాళ్లపై నడిపించారు. బలవంతంగా గడ్డి తినిపించి, మురుగునీరు తాగించారు. కేసు నమోదు విషయంలోనూ పోలీసులు జాప్యం చేశారు. ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో ఒడిశాలో పెచ్చుమీరుతున్నాయి. మేకలను అపహరించారనే పేరుతో జగత్‌సింగ్‌పూర్‌లో ఇద్దరు దళితులకు గుండు కొట్టించి, చెప్పుల దండవేసి ఊరేగించిన వీడియో ఈ ఏడాది జనవరిలో వెలుగుచూసింది. ఇక యోగి కొలువు దీరిన ఉత్తర ప్రదేశ్‌లోగాని, ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో గాని ఇలాంటి ఘటనలకు కొదవే లేదు. అత్యాచారాలు, హత్యలు, నోట్లో చెప్పులు కుక్కడాలు, వారిపై మూత్రం పోయడం, మూత్రం తాగించడం%ొ% ఇలాంటి ఎన్నో అమానుష ఘటనలు. గత ఏడాది యోగి ఆదిత్యనాథ్ పాలనలోని భరూచ్ జిల్లా తాజ్‌పూర్ తెడియాలో దళిత బాలురు దొంగతనం చేశారన్న అనుమానంతో తీవ్రంగా కొట్టడంతోపాటు గుండు గీయించి, ముఖానికి నల్లరంగు పూసి గ్రామంలో ఊరేగించారు. ఐదు కిలోల గోధుమలు అపహరించారని ఆరోపిస్తూ 12 నుంచి 14 ఏళ్ల వయసున్న ముగ్గురు బాలుర ముంజేతులపై దొంగ అని రాసి ఊరేగించారు. బహిరంగంగా కొట్టడం, ఆలయాల్లోకి రానివ్వకపోవడం, చేసిన పనికి జీతం అడిగితే దాడులకు దిగడం, దొంగతనం నేరం మోపడం, సామూహిక అత్యాచారాలకు పాల్పడటం, హత్యలు చేయడం%ొ% లాంటి అమానుషాలు దళితులపై రోజుకు 150కి పైగా జరుగుతున్నాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలే చెబుతున్నాయి. ఎన్‌డిఎ పాలనలో 2018 నుంచి 2022 మధ్య దళితులపై లైంగిక దాడులు 35 శాతం పెరిగాయి. దళితులపై అఘాయిత్యాల కేసులు అధికంగా నమోదవుతున్నది ఉత్తర ప్రదేశ్‌లోనే. దోషులకు శిక్షలు పడటానికి బదులు సన్మానిస్తున్న ఘటనలే అధికంగా ఉంటుండటం%ొ% సంఘ్ మూకలకు ఊతమిస్తోంది.సిజెఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బిఆర్ గవాయ్ తొలిసారి మహారాష్ట్రలో అడుగుపెడితే ప్రోటోకాల్ పాటించకుండా అక్కడి ప్రభుత్వం అవమానించింది. గత ఏడాది మహారాష్ట్ర ఎన్నికల ముందు రాజ్యాంగానికి, అంబేద్కర్‌కు మోకరిల్లుతున్న పోస్టర్లతో రాష్ట్రమంతా ప్రచారం చేసుకున్న దేవేంద్ర ఫడ్నవీస్ ఏలుబడిలోనే ఈ ఉదంతం జరగడం మనువాదుల చేతలను తెలిపేదే. ఏడాది పాలన సందర్భంగా మన రాష్ట్రంలో నిర్వహించిన సభకు స్థానిక సర్పంచ్‌ను వేదికపైకి పిలిచి.. ఆయన దళితుడని తెలియగానే ఆగిపోయిన బిజెపి ఎమ్మెల్యే తీరు ఈ కోవలోదే. పాలకులే కులవివక్షను ఇంత నిస్సిగ్గుగా పాటించడం రాజ్యాంగానికి వ్యతిరేకమే కాదు అనాగరికం కూడా. ఇటువంటి వారికి పదవుల్లో కొనసాగే హక్కే లేదు. ఎస్‌సి, ఎస్‌టి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి. ప్రశ్నిస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉండి, ఇలాంటి ఉదంతాలపై స్పందించడం మాని సనాతన ధర్మం అంటూ మనువా దాన్ని ప్రచారం చేస్తుండటం మరో వైచిత్రి. దళితుల గౌరవాన్ని తుంగలో తొక్కే ప్రతి సంఘటనా రాజ్యాంగంపై దాడే. సమానత్వం, న్యాయం, మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర. దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, మహిళలు వంటి అణగారిన తరగతులకు సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రభుత్వాల విధి. కాని, పాలక పార్టీల నేతలు, అనుయాయులే దాష్టీకాలకు పాల్పడడం దారుణం. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా బాధితులు ఎదురుతిరగడం, పురోగామి శక్తులు వారికి తోడ్పాటున ఒదించడం తప్ప వేరే మార్గం లేదు.

# విరమణ... నిజంగానా?



టెహ్రాన్:ఎప్పటిలాగే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బహుపాత్రాభినయంతో అందరినీ మెప్పిస్తున్నారు. పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు సాగించిన కొన్ని గంటలకే ఇరాన్ ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు అంగీకరించాయని, దాన్ని తాము స్వాగతిస్తున్నా మని మంగళవారం మధ్యాహ్నం ట్రంప్ ప్రకటించారు. దీనికి ఇరాన్ సానుకూలంగా స్పందించినా ఇజ్రాయెల్ మౌనం పాటించింది. ట్రంప్ ప్రకటించిన కాసేపటికే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అది బాంబుల వర్షం కురిపించింది. రెండు దేశాలూ పరస్పరం 'ఎందుకో కూడా తెలియని' విధంగా కాల్పుల విరమణ ఒడంబడికను ఉల్లంఘిస్తున్నాయని ట్రంప్ నిందించి తన 'తటస్థతను' చాటు కున్నారు! ఇంతకూ కాల్పుల విరమణ నిజమేనా? ఒక సమాచారం ప్రకారం ఖతార్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించాక ట్రంప్ చొరవ తీసుకుని ఇరాన్‌తో మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించమని ఖతార్‌ను కోరారు.ఖతార్ తీసుకొచ్చిన ప్రతిపాదనకు ఇరాన్ అంగీకారం తెలిపింది. ఇరాన్ ఈ సంగతి బాహాటంగానే చెప్పింది. కాల్పుల విరమణ గురించి ట్రంప్ బతిమా లుకున్నారని వెల్లడించింది. అయితే ట్రంప్ ప్రకటన తర్వాత కాసేపటికే దాడులకు దిగడాన్నిబట్టి ఇజ్రాయెల్‌కు ఈ పరిణామం ససేమిరా ఇష్టం లేదని బోధపడుతోంది. యుద్ధం ఆపటం సులభమేమీ కాదు. కాల్పుల విరమణ ప్రకటనకూ, దాని ఆచరణకూ మధ్య గంటలు మాత్రమే కాదు... రోజుల వ్యవధి కొనసాగటం రివాజే. మొన్న భారత్%–%పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పంద మైనా, రష్యాఉక్రెయిన్‌ల కాల్పుల విరమణ అయినా ఈ సంగతే చెబుతాయి.యుద్ధానికి ముందు నెల నుంచి ట్రంప్ ఇరాన్‌కు రోజువారీ హెచ్చరికలు జారీచేస్తూ వచ్చారు. అణు ఒప్పందంపై మొండి పట్టుదలకు పోతే దేశం సర్వనాశనమవుతుందని బెదిరించారు. ఆఖరికి ఒకపక్క ఇరాన్ అమెరికాతో చర్చలు సాగిస్తుండగానే పన్నెండు రోజుల క్రితం ఇజ్రాయెల్ ఎలాంటి కవ్వింపూ లేకుండా ఆ దేశంపై దాడులు సాగించి ఇరాన్ సైనిక దళాల చీఫ్‌లు ఇద్దరినీ, అణు శాస్త్రవేత్తలతోసహా పలువురినీ హత్య చేసింది. ఇది తప్పని చెప్పాల్సిన ట్రంప్... ప్రతీకార దాడులకు దిగితే ఖబడ్దార్ అంటూ తిరిగి ఇరాన్‌నే హెచ్చరించారు. ఆఖరికి శనివారం అర్ధరాత్రి దాటాక అమెరికా తానే రంగంలోకి దిగి బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్‌లో మూడు అణు స్థావరాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. ఇంతా అయినాక హఠాత్తుగా ట్రంప్ కొత్త రాగం అందుకున్నారు. ఏకపక్ష యుద్ధం ప్రారంభానికి పూర్వమే ఇరాన్ బలహీనతలు బయటపడ్డాయి. దశాబ్దాల ఆంక్షలతో అన్నివిధాలా దెబ్బతిన్న దేశం మెరుగ్గా ఉండగలదని ఎవరూ భావించలేరు. ఒకపక్క నేరుగా అమెరికా, ఇజ్రాయెల్ కుటిలత్వం తెలుస్తున్నా మిత్రులనుకున్నవారు కూడా ఖండించ టానికి సిద్ధపడకపోవటం... అండగా ఉండగలవని భావించిన రష్యా, చైనాలు ప్రకటనలకే పరిమితం కావటం, గల్ఫ్ దేశాలు నామమాత్రంగా ఖండించి ఊరుకోవటం ఇరాన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసి ఉంటాయి. అణు ఒప్పందానికి సిద్ధపడతామని ప్రకటించి ఆ దిశగా అడుగులేస్తున్న దేశం ప్రపంచంలో ఇలా ఏకాకిగా మిగిలిపోవటం వర్తమాన విషాదం. యుద్ధం పర్యవసానంగా ఇరాన్‌లో పలు దేశాల పెట్టుబడులు దెబ్బతింటాయి. పైగా ప్రపంచానికి పెద్ద పోలీసుగా వ్యవహరిస్తూ తాము చెప్పిందే ఒప్పందమని ఒత్తిడి తెచ్చే ధోరణి రేపన్నరోజు ఎవరికైనా ముప్పే.ఇజ్రాయెల్ దగ్గర... ఆ మాటకొస్తే పశ్చిమాసియాలో అణుబాంబుల జాడలేకపోతే, ఇరాన్ మాత్రమే ఆ పని చేస్తే దాన్ని నియంత్రించటంలో హేతుబద్ధత ఉన్నదని నమ్మినా తప్పుబట్టనవసరం లేదు. కానీ అసలు అమెరికా, రష్యా మొదలుకొని ఏకపక్ష యుద్ధాలతో అందరూ తమ బాధ్యతారాహిత్యాన్ని బయటపెట్టుకుంటుండగా ఒక్క ఇరాన్ మాత్రమే ధూర్త దేశమని ఎందుకు భావించాలి? ఇంతకూ ట్రంప్ హఠాత్తు నిర్ణయం వెనకున్న కారణాలేమిటి? సైనిక స్థావరంపై దాడి చేస్తున్నా మని ఇరాన్ ముందస్తు సమాచారం ఇవ్వటం, అందుకు అనుగుణంగా అమెరికా తన సైనికుల్ని తరలించటంతోపాటు క్షిపణుల్ని కూల్చే ఏర్పాటు చేసుకోవటం సాధ్యమైంది. ఒకే ఒక్కటి పేలినా దానివల్ల నష్టం లేదు. అది ట్రంప్‌కు నచ్చినట్టుంది. దానికితోడు ఆయన అందలం ఎక్కటంలో కీలకపాత్ర పోషించిన 'మాగా' ఈ యుద్ధంపై చీలిపోయింది. గట్టి మద్దతుదారైన స్టీవ్ బెనన్ లాంటివారు సైతం ట్రంప్‌ను తప్పుబట్టారు. ఆ ఒత్తిళ్ల మాటెలావున్నా యూరప్ నుంచి వస్తున్న వార్తలు అమెరికాను భయపెట్టి ఉండాలి. అమెరికా తర్వాత బంగారం నిల్వల్లో రెండు, మూడు స్థానాల్లో ఉన్న జర్మనీ (3,352 టన్నులు), ఇటలీ (2,452 టన్నులు) ఆ నిల్వల్లో మూడోవంతు భాగాన్ని అమెరికా ఫెడరల్ రిజర్వ్‌లో ఉంచాయి. దాన్ని వెనక్కుతేవాలని ఆ దేశాల్లో డిమాండ్లు బయల్దేరాయి. నిల్వల విలువ 24,500 కోట్ల డాలర్ల పైమాటే. ఫెడరల్ రిజర్వ్ స్వతంత్రతను దెబ్బతీసేలా ట్రంప్ వ్యవహరించటం, ప్రపంచాన్ని అస్థిరపరిచే నిర్ణయాలు తీసుకోవటం తదితర కారణాల వల్ల అమెరికాలో బంగారం ఉంచటం సురక్షితం కాదని విపక్షాలు వాదిస్తున్నాయి. అది ఆచరణ రూపందాలిస్తే అమెరికా ఆర్థికవ్యవస్థ మరింత కుంగిపోవటం ఖాయం. పైగా లండన్‌తో పాటు ప్రపంచంలోనే కీలకమైన బంగారం కేంద్రంగా వెలిగిపోతున్న న్యూయార్క్ కళ అడుగంటుతుంది. అందుకే ట్రంప్ పునరాలోచనలో పడ్డారా? లేక ముందస్తు సమాచారం ఇచ్చిన ఇరాన్ 'మంచితనం' నచ్చిందా? మొత్తానికి అగ్ని గుండం కాబోతున్న పశ్చిమాసియాలో సామరస్య గాలులు వీచటం ఆహ్వానించదగ్గది. ఇది పూర్తి స్థాయిలో సాకారం కావాలని ఆశించాలి.

# పవన్‌తో స్కెచ్.. తమిళనాడులో బీజేపీ చరిత్ర తిరగరాస్తుందా?



అమరావతి,ద్రవిడ రాజకీయాల్లో హిందూత్వ.. ప్రభావం చూపుతుందా..? తమిళనాడు నేలపై ఈసారి ఎలాగైనా జెండా పాతేందుకే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను బీజేపీ.. ట్రంప్‌కార్డుగా ప్రయోగిస్తోందా..? కమలం అగ్రనాయకత్వం గీసిన స్కెచ్ ఏ మేరకు వర్కవుటవుతుంది..? ప్రస్తుతం దీనిపైనే పొలిటికల్ వర్గాల్లో చర్చ.ఆపరేషన్ తమిళనాడు..! గత కొన్నేళ్లుగా బీజేపీ టార్గెట్ ఇదేనని చెప్పాలి.దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు పాలిటిక్సే వేరు. జాతీయ పార్టీలకంటే ఇక్కడ ప్రాంతీయ పార్టీల హవానే ఎక్కువ. అందుకే.. కేంద్రంలో ఏ నేషనల్ పార్టీ పవర్‌లో ఉన్నా.. తమిళనాట మాత్రం అయితే డీఎంకే, లేదంటే అన్నాడీఎంకే అన్నట్లుగానే ఇప్పటివరకు రాజకీయం సాగింది. అలాంటి చోట ఈసారి పాగా వేయాలని భావిస్తున్నారు కమలనాథులు. 2026లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలను హీటెక్కిస్తున్నారు కాషాయ పార్టీ నేతలు. ఇందులో భాగంగానే ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ అధినేత, సినీ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దింపారన్న మాట ఆఫ్‌లైన్లో విన్పిస్తోంది. కమలం అధినాయకత్వం ప్లాన్‌లో భాగంగానే పవన్ మధురైలో పర్యటించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేరుకు మురుగన్ భక్తుల మహానాడులో పవన్ పాల్గొన్నా ఆయన చేసిన హిందూత్వ ప్రసంగమే ఇందుకు నిదర్శనమన్న కామెంట్లు విన్పిస్తున్నాయి.

హిందూత్వను బలంగా వినిపిస్తున్న జనసేనాని

అంతా ఊహించినట్లుగానే సభా వేదికపై నుంచే హిందూత్వ వాదాన్ని మరోసారి బలంగా విన్పించారు పవన్ కల్యాణ్. పదహారేళ్ల వయసులోనే తాను శబరిమల వెళ్లినట్లుగా తెలిపారు పవన్. ఇంట్లో విభూతి పెట్టుకొని మరీ బడికి వెళ్లేవాడినని చెప్పుకొచ్చారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని.. అలాగే హిందువు అయినందుకు ఎంతో గర్వపడతానంటూ లక్షలాదిగా వచ్చిన భక్తుల మధ్య ప్రకటించారు పవన్. మార్పు రావాలంటే ధైర్యం ఉండాలంటూ ఇదే వేదికపై నుంచి గర్జించారు పవన్. అసలు మురుగనే తొలి విప్లవనాయకుడని, ఆయనకు బేధభావం లేదన్నారు. అందరూ సమానమేనన్నారు పవన్. ఎలుకల సంఖ్య ఎంత ఉన్నా నాగుపాము గట్టిగా శబ్దం చేస్తే వాటంతటవే పరుగు తీస్తాయన్నారు. ఈ నమ్మకంతోనే మార్పు వస్తుందని కచ్చితంగా తాను నమ్ముతానన్నారు పవన్. మురుగన్ భక్తుల మధ్య ఏపీ డిప్యూటీ సీఎం పవన్ చేసిన ఈ కామెంట్ల పైనే డీఎంకే భగ్గుమంటోంది. ఏ ప్రయోజనాలు ఆశించి తమిళనాడులో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌ను ఆహ్వానించారని బీజేపీకి ప్రశ్నలు సంధిస్తోంది డీఎంకే.

బీజేపీ సౌత్‌లో గట్టి పట్టున్నది కర్ణాటకలోనే

కేవలం ఇప్పుడే కాదు.. కొన్ని రోజుల క్రితం సైతం పవన్ కల్యాణ్ తమిళనాడులో పర్యటించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమంలో భాగంగా తమిళనాడులో పర్యటించిన ఆయన.. డీఎంకేను ఉద్దేశిస్తూ ఘాటైన వ్యాఖ్యలే చేశారు. జమిలీ ఎన్నికలను డీఎంకే అధినేత కరుణానిధి కోరుకున్నారని..కానీ, ఇప్పుడు అవే ఎన్నికలను ఆయన కుమారుడు స్టాలిన్ వ్యతిరేకిస్తున్నారంటూ ఫైరయ్యారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కారణంగా ప్రాంతీయ పార్టీలకు దెబ్బ తగులుతుంది అన్న విమర్శలను ఈ సందర్భంగా కొట్టిపారేశారు పవన్ కల్యాణ్. దక్షిణాదిలోని తమిళనాట పాగా వేయాలని గట్టి ప్రయత్నం చేస్తున్నారు కాషాయ పార్టీ నేతలు. కానీ, వాళ్ల ప్లాన్లు మాత్రం పెద్దగా వర్కవుట్ కావడం లేదనే చెప్పాలి. నిజానికి%ొ% సౌత్‌లో బీజేపీకి బాగా పట్టున్నది ఒక్క కర్ణాటకలోనే. ఇప్పటికే పలుమార్లు అక్కడ సొంతంగానూ, మిత్ర పక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది బీజేపీ. పైగా యడ్యూరప్ప లాంటి దిగ్గజ నేతలు ఆ పార్టీలో ఉండి రాష్ట్ర రాజకీయాలను కొన్నేళ్ల పాటు శాసించారు.

ఏపీలో అధికార భాగస్వామిగా ఉన్న కమలం పార్టీ

ఇక, రెండు తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కట్టుగా 2024 ఎన్నికల్లో పోటీ చేసి బంపర్ విక్టరీ కొట్టాయి. దీంతో.. ఏపీలోనూ కమలం పార్టీ అధికారంలో ఉన్నట్లుగానే భావించాలి. తెలంగాణలో మాత్రం కమలం పార్టీకి చెప్పుకోదగిన స్థాయిలోనే సంఖ్యా బలముంది. ప్రధానంగా ఆ పార్టీ తరఫున 8 మంది ఎంపీలున్నారు. అసెంబ్లీలోనూ 8 మంది ఎమ్మెల్యేలున్నారు. 2018 ఎన్నికలతో పోలిస్తే 2023లో బీజేపీ చాలా బలపడింది. కానీ, అధికారం అంటారా ఇప్పుడప్పుడే కష్టమనే అభిప్రాయం ఆ పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతోంది. మరో దక్షిణాది రాష్ట్రమైన కేరళలో కమలనాథుల ప్రభావం అంతంత మాత్రమే. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కేరళ నుంచి కేవలం ఒకే ఒక్క ఎంపీ స్థానం గెలిచింది బీజేపీ. ప్రముఖ మలయాళ నటుడు సురేష్ గోపి త్రిస్సూర్ నుంచి విజయం సాధించి కేంద్ర మంత్రి వర్గంలో చోటు సంపాదించారు.

ద్రవిడ గడ్డపై పట్టుకోసం కమలనాథుల ఆరాటం

ఇలా దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో తనదైన ప్రభావం చూపిస్తున్న బీజేపీకి ద్రవిడ గడ్డపై మాత్రం పట్టు చిక్కడం లేదు. వాస్తవానికి 2014 ఎన్నికల వేళ%ొ% నాటి ప్రధాన మంత్రి అభ్యర్థిగా ఉన్న నరేంద్రమోడీ స్వయంగా తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ప్రధానిగా మోడీ అయిన తర్వాత కూడా ఇరువురి మధ్యా మంచి స్నేహమే నెలకొంది. కానీ, రజనీకాంత్ మాత్రం కమలనానికి మద్దతు ఇవ్వలేదు. దీంతో.. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం అన్నామలైని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడ్ని చేసింది. దీంతో.. ఆయనా దూకుడుగా వ్యవహరించారు. కానీ, ఫలితం మాత్రం పెద్దగా రాలేదు.ఇలాంటి వేళ 2026 ఎన్నికల నాటికి తమిళనాడు అసెంబ్లీలో చెప్పుకోదగిన స్థాయిలో సీట్లను సాధించాలంటే హిందూత్వ అజెండాను మరింత ఉధృతంగా విన్పించే నాయకులైతేనే బెటర్ అన్నట్లుగా కాషాయ పార్టీ నేతలు ఆలోచించినట్లు సమాచారం. అన్ని రకాలుగా ఆలోచించి చివరకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దింపినట్లుగా తెలుస్తోంది. గత కొన్నాళ్లుగా సనాతన ధర్మం గురించి గట్టిగా తన వాయిస్ విన్పిస్తున్న పవన్‌ను ట్రంప్ కార్డుగా ఉపయోగించి మురుగన్ భక్తులను ఆకట్టుకోగలిగితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మైలేజ్‌తోపాటు సీట్లు వస్తాయన్నది కమలనాథుల ఆలోచనగా తెలుస్తోంది. చూడాలి మరి.. బీజేపీ ప్లాన్ ఎంతవరకు వర్కవుటవుతుందో.

## కొనసాగుతున్న ఆపరేషన్ 'సింధు'

న్యూఢిల్లీ,ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ కారణంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని రప్పించేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని స్వదేశానికి తీసుకొస్తోంది. పొరుగు దేశాలకు చెందిన పౌరులకు కూడా భారత్ ఆపరేషన్ సింధు ద్వారా సాయం చేస్తోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటికే పలువురు భారతీయులు స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే.

# పాస్‌పోర్టు సేవల్లో అరుదైన గుర్తింపు

న్యూఢిల్లీ,రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారుల సమావేశం-2025లో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి అరుదైన గుర్తింపు దక్కింది. 2024-25 మధ్య కాలానికి గానూ ' సంస్కరణలు, ప్రజా సేవపట్ల నిబద్ధత' విభాగంలో హైదరాబాద్ ఆర్పీవో (రీజినల్ పాస్‌పోర్టు ఆఫీస్) అవార్డు సాధించింది. ఈ అవార్డును మంగళవారం నిర్వహించిన 13వ పాస్‌పోర్టు సేవా దివస్ కార్యక్రమంలో విదేశాంగశాఖ సహాయమంత్రి పవిత్ర ప్రదానం చేశారు. హైదరాబాద్ పాస్‌పోర్టు అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ ఈ అవార్డు అందుకున్నారు. అంతేకుండా పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో ఉత్తమ సేవలు అందించినందుకుగానూ తెలంగాణ పోలీసు విభాగాన్ని కూడా సత్కరించారు. తెలంగాణ పోలీస్ తరఫున ఇంటెలిజెన్స్ డీజీ బత్తుల శివధర్‌రెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.2024-25 ఆర్థిక సంవత్సరానికి పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినందుకు గుర్తింపుగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలంగాణ పోలీసులకు 'సర్టిఫికేట్ ఆఫ్ రికగ్నిషన్'ను ప్రదానం చేసింది. జూలై 24, 2024న న్యూఢిల్లీలో జరిగిన పాస్‌పోర్ట్ సేవా దివస్ కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రాన్ని తెలంగాణ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ బి. శివధర్ రెడ్డి స్వీకరించారు. విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా హాజరై గుర్తింపు పత్రాన్ని అందించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 8,06,684 పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణను తెలంగాణ పోలీసులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ధృవీకరణలు పూర్తిగా నిర్ణీత వ్యవధి 15 రోజులలోపు పూర్తయ్యాయి. వాస్తవానికి, తెలంగాణలో పాస్‌పోర్ట్ ధృవీకరణలకు తీసుకున్న సగటు సమయం 7 రోజులకు కూడా తగ్గిందనే ప్రశంసనీయమైన ఘనతను సాధించారు. ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి, ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, తెలంగాణ పోలీసులు స్వయంగా అభివృద్ధి చేసిన 'సత్యాపన్', 'వెరిఫాస్ట్' సాఫ్ట్‌వేర్‌లు కీలక పాత్ర పోషించాయి. ఫేస్ రికగ్నిషన్, డేటా మ్యాచింగ్ టెక్నాలజీలతో కూడిన ఈ సిస్టమ్‌లు సీసీటీఎన్ఎస్, పాత పాస్‌పోర్ట్ దరఖాస్తు డేటా, ఇతర డేటాబేస్‌లతో సరిపోల్చడం ద్వారా దరఖాస్తుదారులకు ఏమైనా నేరచరిత్ర ఉంటే త్వరగా గుర్తించగలుగుతున్నాయి. 2014 నుంచి ఇప్పటి వరకు ఆరుసార్లు తెలంగాణ పోలీసుశాఖ ఈ విషయంలో ఉత్తమ ప్రదర్శన కలిగిన రాష్ట్రాల జాబితాలో స్థానం దక్కించుకోవడం గర్వకారణం. ఇది పబ్లిక్ సర్వీసు పట్ల పోలీసుశాఖ చూపిన నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ మేరకు, 2024-25లో తెలంగాణ పోలీసులకు లభించిన ఈ జాతీయ గుర్తింపుపై, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్ని యూనిట్ల అధికారులను, ప్రత్యేక బ్రాంచ్ అధికారులను, సంబంధిత సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. పౌరులకు వేగవంతమైన, పారదర్శకమైన, అవినీతి రహిత సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్రం మూడు ప్రధాన లక్ష్యాలపై దృష్టి సారించింది.

# డ్రగ్స్‌తో లక్షలు సంపాదించాలన్న ఆశ

హైదరాబాద్, సాఫ్ట్వేర్ ఉద్యోగంతో వస్తున్న లక్షల జీతాలు సరిపోవంటూ డ్రగ్స్ అమ్మకాలకు దిగడంతో చేస్తున్న ఉద్యోగం ఊడింది. ఒకటికి రెండుసార్లు ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడి ఊచలు లెక్కించాల్సిన పరిస్థితి ఏర్పాడింది. ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన వి. వెంకట జగదీశ్వర్ రెడ్డి (25) అనే సాఫ్ట్వేర్ ఉద్యోగి రాజేంద్రనగర్ మండలం మైలార్ దేవులపల్లి ప్రాంతం మైఫిల్ హోటల్ సమిపంలో డ్రగ్స్ ను తీసుకు వెళ్తుండగా డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్ మంగళవారం తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద 23.3 ఎండీఎంఏ డ్రగ్స్, సెల్ ఫోన్, బైకును స్వాధీనం చేసుకున్నారు. బీటెక్ చదివి బెంగళూరులో కాట్నీ వెల్ అనే సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ అక్కడే డ్రగ్స్ కి అలవాటు పడ్డాడు.బెంగళూరుకు చెందిన సైఫ్ షరీఫ్ అనే వ్యక్తి వద్ద రూ. 1500 ఒక గ్రాము చొప్పున ఎండీఎంఏ డ్రగ్స్ ను కొనుగోలు చేసి హైదరాబాదులో రూ. ఐదు వేల నుంచి రూ. 8 వేల వరకు గ్రామ చొప్పున అమ్మకాలు జరుపుతున్నాడు. ఈ మధ్యనే ఎండీఎంఏ డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి కండిషన్ బెయిల్ పై బయటకు వచ్చాడు. మళ్లీ డ్రగ్స్ తో మంగళవారం డీటీఎఫ్ శంషాబాద్ టీంకు పట్టుబడ్డాడు. డ్రగ్స్ అమ్మకాలతో మొదటగా ఉప్పల్లో పట్టుబడటంతో చేస్తున్న సాఫ్ట్వేర్ ఉద్యోగం పోయింది. కేసు పూర్వపరాలను శంషాబాద్ ఏఈఎస్ అయినేని శ్రీనివాసరెడ్డి శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో పోలీస్ వివరించారు.

డ్రగ్స్ అమ్మినా, కొనుగోలు, రవాణా చేసిన కఠినంగా శిక్షిస్తాం

విజయవాడ, డ్రగ్స్ అమ్మినా, కొనుగోలు, రవాణా చేసిన కఠినంగా శిక్షిస్తామని ఈగల్ చీఫ్ , ఐజీ రవికృష్ణ హెచ్చరించారు. ఏపీలో డ్రగ్స్‌కు చోటు లేదని స్పష్టం చేశారు. డ్రగ్స్ వెనుక ఎంతటి వారున్న ఎవరినీ వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం సిద్ధార్థ మెడికల్ కళాశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఈగల్ చీఫ్, ఐజీ రవికృష్ణ, విజయవాడ డీసీపీ సరిత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మీడియాతో మాట్లాడారు. గుంటూరులో జరిగే యాంటీ డ్రగ్స్ డే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటున్నారని తెలిపారు. ఈగల్ తరఫున విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, చట్టాలపై వారికి వివరించామని ఐజీ రవికృష్ణ చెప్పారు. డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈగల్ అడుగులు వేస్తోందని ఐజీ రవికృష్ణ ఉద్ఘాటించారు. గంజాయి, ఎండీఎంఏ డ్రగ్స్ వాడుతున్న వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నామని అన్నారు. ఎండీఎంఏ డ్రగ్స్ తరలిస్తూ పట్టుబడిన వారిలో విద్యార్థులే అధికంగా ఉంటున్నారని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా 1972 కాల్ చేయాలని అన్నారు. అప్పర్ ప్రైమరీ స్కూల్స్ నుంచి యూనివర్సిటీల వరకు 45 వేల ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 7640 వరకు అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. మైగ్రేడ్ వర్కర్లను కూడా కలిసి వారికి కూడా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. 34లక్షల మంది ఇతర రాష్ట్రాల నుంచి ఏపీకి వచ్చి ఉంటున్నారని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా గంజాయి తెచ్చినా చర్యలు కఠినంగా ఉంటాయని ఐజీ రవికృష్ణ హెచ్చరించారు. ఎండీఎంఏ డ్రగ్స్ కూడా ఇటీవల పట్టుబడిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. బ్యాక్ వర్డ్ లింక్స్, ఫార్వార్డ్ లింక్స్ కూడా కనిపెట్టి పూర్తిగా నిరోధించేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. మత్తు పదార్థాలు రవాణా చేస్తే ఏడాది పాటు జైలుకు వెళ్లక తప్పదనే విషయాలను వివరిస్తున్నామని చెప్పారు. యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని తెలిపారు. ఏ విద్యార్థి డ్రగ్స్ బారిన పడినా.. అతనితో పాటు, ఆ కుటుంబం కూడా నష్టపోతుందని చెప్పారు. డ్రగ్స్ రవాణా చేస్తే భవిష్యత్‌లో వారి పాస్‌పోర్టు రద్దవుతుందని హెచ్చరించారు.

## హస్తకళలపై సావనీర్ డిజైన్ పోటీలు

విజయవాడ, చేనేత హస్త కళాకారులు, కార్మికులు, డిజైన్స్, చేతిపనుల పట్ల మక్కువ కలిగి సృజనాత్మక అభిరుచి కలిగిన ఔత్సహికుల నుండి హస్తకళల పై సావనీర్ డిజైన్ పోటీలలో పాల్గొనేందుకు దరకాస్తులు కోరుతూ అవకాశం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సాంప్రదాయ హ్యాండీక్రాఫ్ట్‌లు, హ్యాండ్లూమ్స్‌లలో కొత్త సావనీర్ డిజైన్లను సృష్టించేందుకు జాతీయ డిజైన్ సంస్థ రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహించన్నట్లు ఆయన తెలిపారు. 8 సంవత్సరాల వయస్సు పైబడి రాష్ట్రానికి చెందిన కళాకారులు, వీవర్స్, డిజైనర్లు, విద్యార్థులు ప్రజలు పోటీలలో పాల్గొన వచ్చునని తెలిపారు. హస్తకళలపై సామర్థ్యాన్ని పెంచడం, సాంప్రదాయ కళాకృతులు, ఆధునిక డిజైన్లను కలిపిన కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. హ్యాండీక్రాఫ్ట్‌కు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కొండపల్లి బొమ్మలు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎటికొప్పాక బొమ్మలు, తిరుపతి జిల్లాకు చెందిన చెక్కతో చెక్కవేతనం, కృష్ణా జిల్లాకు చెందిన కళంకారి బ్లాక్ ప్రింట్స్, శ్రీసత్య సాయిజిల్లాకు చెందిన చర్మపప్పేట్రీ అంశాలపై ధర్మవరం సిల్క్స్, ఉప్పాడ సిల్క్స్, వైస్ట్ కోట్స్, మంగళగిరి, బందర్, రాజమహేంద్రవరం, కృష్ణ, తూర్పు గోదావరి జిల్లాల హ్యాండ్లూమ్స్‌లపై పోటీలను నిర్వమిస్తున్నట్లు తెలిపారు. హ్యాండీక్రాఫ్ట్స్ ఆంధప్రదేశ్ సావనీర్‌లలో న్యూమాటిక్, ఆటోమేషన్, కొత్త డిజైన్లను హ్యాండ్లూమ్స్‌లో పాల్స్, స్కార్ఫ్స్, టైస్, వైస్ట్ కోట్స్ వంటి ఉపయుక్త వస్తువులను పరిచడం చేయాలన్నదే పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. ÷రిలిటీలలో వివిధ విభాగాలకు చెందిన ముగ్గురు ఉత్తమ విజేతలకు నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్స్‌లలో ఒక్కొక్క విభాగంలో ఐదుగురు మొత్తంగా పదిమందికి మొదటి బహుమతిగా 25 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 15 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 10 వేల రూపాయలను పారితోషకంగా అందించడం జరుగుతుందన్నారు. జూలై 16వ తేదీ లోగా కొత్తగా సృష్టించిన సావనీర్ సమూనాలను రాష్ట్రంలోని సమీప లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో సమర్పించాలన్నారు. పోటీల పక్రియను లేపాక్షి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం విశ్వ పర్యవేక్షిస్తారన్నారు.

## కావాలనే కొందరు దీనిని తక్కువ చేసే యత్నం

వాషింగ్టన్, ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని చెబుతున్నాయి. ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## అప్పటి కాంగ్రెస్ అధికార దాహానికి నిదర్శనం

అమరావతి,1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత చీకటి అధ్యాయాలలో ఒకటని.. ఇది కేవలం ఒక రాజకీయ సంఘటన కాదు.. ఇది రాజ్యాంగానికి ప్రత్యక్ష ద్రోహమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం.. అప్పటి కాంగ్రెస్ నాయకత్వం అధికార దాహానికి చిహ్నమని అన్నారు. పత్రికలను అణచివేశారని, ప్రతిపక్షాల గొంతు నొక్కివేశారని, ప్రాథమిక హక్కులను నిలిపివేశారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె.అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్, మొరార్జీ దేశాయ్ వంటి గొప్ప నాయకులు అనేక మంది ప్రజాస్వామ్య రక్షణ కోసం నిలబడి జైలు పాలయ్యారని పవన్ కల్యాణ అన్నారు. ఈ రాజ్యాంగ ద్రోహానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియంతృత్వానికి వ్యతిరేకంగా నిర్భయంగా నిలబడి మన ప్రజాస్వామ్య గౌరవాన్ని నిలబెట్టిన వారి త్యాగాలను గుర్తు చేసుకోవడానికి 'సంవిధాన్ హత్య దివస్'ను పాటిస్తామని అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన నాయకుడు చేసిన త్యాగాలను, వారి గొంతులను అణచివేసిన లక్షలాది మంది వేదనను గుర్తుచేసుకుందామన్నారు. నేటికీ, రాజకీయాల పేరుతో మన రాజ్యాంగాన్ని రాజీ చేసే ఏ ప్రయత్నానికైనా దూరంగా ఉండాలని పవన్ కల్యాణ్ అన్నారు.

# నివురుగప్పిన నిప్పులా కాంగ్రెస్‌లో కలహాలు



హైదరాబాద్,అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ప్రభుత్వం సమన్వయంతో పని చేయాలని, అలసత్వం వీడి, క్రమశిక్షణతో మరింత కష్టపడాల్సి ఉందని పిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఏసి) అభిప్రాయపడింది. మంగళవారం గాంధీ భవన్‌లో జరిగిన ఈ భేటీలో 'తెలంగాణలో పదేళ్లు కాంగ్రెస్ దే అధికారం, నాది బాధ్యత' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పనులు జరిపించి ప్రజల్ని మెప్పించడానికి అధికారం నిధులు తమ వద్దే ఉన్నాయి కనుక స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించే బాధ్యత మంత్రులు తీసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలపాలని పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అంటేనే కలతల కాపురం, కప్పల తక్కెడ! పార్టీ అధికారంలో ఉన్నపుడు ఇది ఇంకాస్త ఎక్కువే! కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రత్యర్థుల సమయం బాగోక, పార్టీ అదృష్టం బాగుంటే%ా% కనీసం ఎన్నిక వరకైనా అందరూ కలిసికట్టుగా పనిచేసి అధికారంలోకి వస్తారు. అయినాక, పరస్పరం పడక కొట్టుకుచస్తారన్నది నానుడి! ఇప్పుడా దృశ్యం తెలంగాణలో క్రమంగా కళ్లకు కడుతోంది. సొంత పార్టీ ప్రభుత్వ పనితీరునే తప్పుపడుతూ కొందరు కోర్టుకెక్కడం. పార్టీ ఎంఎల్ఎలే అవినీతికి పాల్పడుతున్నారని పైస్థాయి నాయకులు బహిరంగంగా మాట్లాడటం. ప్రభుత్వ విధాన నిర్ణయాలను ముందుగానే కొందరు మంత్రులు ప్రకటించడం, దాన్ని పిసిసి నేత, సిఎం మందలించడం, ఎన్నికలకు మూడేళ్ల ముందే ఫలానా సీటు నాదే అనో, ఫలానా స్థానం నుంచి నా బిడ్డ పోటీ చేస్తుందనో ఎవరికి వారు ప్రకటించడం%ా% ఇటువంటివన్నీ పార్టీలోని అనైక్యతకు, గందరగోళానికీ అద్దం పడుతున్నాయి.ముఖ్యమంత్రి కొందరు మంత్రుల మధ్య ఏదో కనబడని సహాయ నిరాకరణలాంటిది ఉందని పార్టీలోనే గుసగుసలున్నాయి. ఇక పలుచోట్ల మంత్రులకు ఎంఎల్ఎలకు మధ్య పొసగటం లేదు. తెగించి కొందరు ఎంఎల్ఎలు మంత్రిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదే చేశారు. మరికొన్ని చోట్ల వారి మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇంకొంచెం కిందకు వెళితే, సమన్వయ లోపమే కాకుండా ఎంఎల్ఎలు స్థానిక నాయకుల మధ్య చాలా చోట్ల స్పర్థలు, గొడవలూ ఉన్నాయి. పరస్పరం వ్యతిరేక కార్యకలాపాలు, చర్యలకే దిగుతున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి కొత్త అధ్యక్షుడు వచ్చాక దాదాపు పది నెలలకు పిసిసి కార్యవర్గం వచ్చింది. కాంగ్రెస్ శాసనసభా పక్షం (సిఎల్‌పి) కయితే ఇప్పటికీ కార్యవర్గమే లేదు!. ఏవి ఎంత వరకు నిజమో కాలం తేలుస్తుంది, కానీ అధికారంలో ఉన్నప్పుడు అభియోగాలు తప్పవు. సొంత పార్టీ నాయకులే పాలకుల అవినీతిపై విమర్శలు చేస్తున్నారు.నగరంలోని ఖాజాగూడలో 27 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని, ఈ వ్యవహారంలో అధికారుల చేష్టల్ని అడ్డుకోవాల్సిందేనని పార్టీ నాయకులే డిమాండ్ చేస్తున్నారు. 'హైడ్రా'కు ఫిర్యాదు చేసినా తగిన స్పందన లేదనే కోపంతో కాంగ్రెస్‌కు చెందిన ఎంఎల్ఎలు అనిరుధ్ రెడ్డి (జడ్చర్ల), యన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), కె. రాజేశ్వరరెడ్డి (నాగర్‌కర్నూల్), మురళీ నాయక్ బుక్యా (మహబూబాబాద్) తదితరులు న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసే పరిస్థితి వచ్చింది. అంతకు ముందు దీపాదాస్ మున్షీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీగా ఉన్న కాలంలోనే అనిరుధ్ రెడ్డి యువనాయకులతో కలిసి ఫామ్ హౌజ్‌లో భేటీ కావడం, కొందరు మంత్రులపై నిర్దిష్టంగా ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌లో కలకలం రేపింది. ఆయనకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సన్నిహిత సంబంధాలుండటం వంటివి అంతర్గతంగా పార్టీలో ఉన్న విభేదాలకు తార్కాణమని కాంగ్రెస్‌లోనే ప్రచారం జరుగుతోంది. బిల్లులు మంజూరు చేయడంలో, డబ్బు విడుదలలో 'కమీషన్లు' వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రస్థాయిలో వచ్చాయి. మున్నెన్నడు లేని విధంగా వంద మందికిపైగా కాంట్రాక్టర్లు ఏకంగా రాష్ట్ర సచివాలయానికే వెళ్లి, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు విక్రమార్క భట్టి చాంబర్ ముందు ధర్నాకు దిగడం, రభస చేయడం సంచలనం సృష్టించింది.కమీషన్ల వ్యవహారం తలవంపులుగా ఉందని, ఎందుకిలా బయట ప్రచారంలోకి వచ్చిందో స్పష్టత ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రివర్గ సమావేశంలోనే ఈ అంశాన్ని ప్రస్తావించినట్టు, ఇతర మంత్రులు కొందరు ఆయన్ని అనునయించినట్టు బయట ప్రచారం జరిగింది. బయటకంతా గుంభనంగా కనిపిస్తున్నా%ా% గొంతెత్తడానికి మరికొందరు నాయకులు సమయం కోసం వేచిచూస్తున్నారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు ఆరంభం నుంచీ పలుమార్లు వివాదాస్పదమయ్యాయి. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావును విమర్శించే క్రమంలో ఒక సినీ హీరోయిన్ పేరు ప్రస్తావిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారమే రేపాయి. అలా మాట్లాడటాన్ని బయటే కాకుండా పార్టీలో అన్ని స్థాయిల్లోనూ తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై పార్టీ ఢిల్లీ అధిష్టానం మందలించి వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తెచ్చారు. ఇతర ఎంఎల్ఎలలాగా పనులు చేయడానికి తాను డబ్బులు తీసుకోనంటూ ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, 'అది ఇప్పుడు కాదు, గత ప్రభుత్వ కాలంలో%ా%' అంటూ తదుపరి వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు కల్పించాయి. జిల్లాలోనూ ఆమెకు స్థానిక ఎంఎల్ఎలతో విభేదాలున్నాయి.కడియం శ్రీహరిపై చేసిన దురుసు వ్యాఖ్యలు పలువురి దృష్టినాకర్షించాయి. పాత వరంగల్ జిల్లాలోని అయిదుగురు పార్టీ ఎంఎల్ఎలు ఆమెకు వ్యతిరేకంగా పార్టీ వ్యవహారాల ఇంచార్జి అయిన మీనాక్షి నటరాజన్‌కి ఫిర్యాదు చేసినట్టు వార్తలొచ్చాయి. 'రాజీనామాలు చేసి గెలవాల'ని పార్టీ ఎంఎల్ఎలకే సవాల్ విసురుతూ మంత్రి సురేఖ భర్త కొండా మురళి చేసిన వ్యాఖ్యలు మరింత వివాదాస్పదమయ్యాయి. దానికి తోడు, పార్టీ సిట్టింగ్ ఎంఎల్ఎ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి, వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా తన బిడ్డ పోటీ చేస్తుందనడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇది ఏకపక్ష, దుందుడుకు శైలి అని తప్పుబడుతున్నారు. పార్టీని లెక్కచేయకుండా ఇలా మాట్లాడటమేమిటని పిసిసి నాయకత్వం కూడా ఈ విషయంలో ఆగ్రహంగానే ఉంది. రేపు ఉప ఎన్నిక జరగాల్సి ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి తానే పోటీ చేయనున్నట్టు, గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన క్రికెటర్ అజహరుద్దీన్ ప్రకటించడాన్ని పిసిసి నాయకత్వం తప్పుబట్టింది. ఆసక్తిని వ్యక్తం చేయడం వేరు, పార్టీలో చర్చించకుండా, నిర్ణయం తీసుకోకుండా 'నేనే పోటీ చేస్తాను' అని టిక్కెట్ ఆశించే వ్యక్తి ప్రకటించడమేమిటన్నది నాయకత్వం అభ్యంతరంగా ఉంది.అన్ని స్థాయిల్లో పార్టీని సమన్వయంతో అదిమిపెట్టే యంత్రాంగం, వ్యవస్థ తెలంగాణ కాంగ్రెస్‌లో లేకుండా పోయింది. తొలిసారి తెలుగుదేశం పార్టీని ఓడించి అధికారంలోకి వచ్చిన తర్వాత (1989 94) అయిదేళ్ల పాటు పార్టీ బలహీనపడుతూ వచ్చినప్పటి లక్షణాలు ఇప్పుడు పొడచూపుతున్నాయి. అప్పుడు 294 నియోజకవర్గాలకు గాను పార్టీ ప్రాతినిధ్యం 26కు పడిపోయింది. నాటి పరిస్థితులతో పోల్చి చూస్తే%ా% వర్గాలుగా చీలినప్పటికీ, కనీసం అప్పుడు పేరున్న, పలుకుబడి కలిగిన బడా నాయకులైనా ఉండేవారు. ఇప్పుడు ఏ నాయకుడూ కనీసం 1o1 (ఒకే కుటుంబంలోని వారు మినహాయిస్తే) ఎంఎల్ఎల బలంతో లేరు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారు, బిఆర్ఎస్ నుంచి వచ్చినవారు, మొదట్నుంచీ పార్టీనే అంటిపెట్టుకొని ఉన్న అసలు కాంగ్రెస్ వాదులు కలగలిసి, వాతావరణం అంతా కలగాపులగంగా ఉంది. ఒకరికొకరికి పడటం లేదు. వివక్షకు గురవుతున్నామని కొందరు ఆందోళ చెందుతున్నారు. పార్టీ కోసం పనిచేసే వారిని పట్టించుకోవడమే లేదని, 'ముఖం చూసి బొట్టుపెడుతున్నార'ని ముఖ్యమంత్రిపైన, మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర ముఖ్యనాయకులపైన ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో 'బంగారు తెలంగాణ బ్యాచ్' లాగానే ఇప్పుడు కాంగ్రెస్‌లో 'తెలుగు కాంగ్రెస్' ప్రాబల్యం పెరిగిందనే విమర్శ ఉంది.జగిత్యాలలో ఎంఎల్ఎ సంజయ్, మాజీ ఎంఎల్ఎ జీవన్‌రెడ్డిల మధ్య సయోధ్య దాదాపు అసంభవంగానే కనిపిస్తోంది. ఇటువంటివి ఇంచుమించు పార్టీ అన్ని స్థాయిల్లోనూ ఉన్నాయి. పార్టీపై సమగ్రంగా పట్టు ఎవరికీ లేని పరిస్థితి! 'మా మాదిగలకు మరో మంత్రి పదవి ఇవ్వండి' అని పార్టీ అధిష్టానాన్ని కోరడం నుంచి, గతంలో లేని విధంగా 'నాకు మంత్రి పదవి ఇప్పించండి' అని ఓ ఎంఎల్ఎ నేరుగా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అడగటం వంటి కొత్త లక్షణాలు పెరుగుతున్నాయి. ఇకపై జిల్లా నాయకత్వానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తామని గుజరాత్‌లో ఇటీవల జరిగిన పార్టీ అత్యున్నత సమావేశంలో నిర్ణయించారు. అవసరమైనచోట మార్పులు చేసి, ఆ జిల్లా నాయకత్వాన్ని పటిష్టపరుస్తామని చేసిన ప్రకటన ఆచరణకు నోచుకోలేదు. జిల్లాల్లో సమన్వయం బాగా దెబ్బతిని పరస్పరం కారాలు, మిరియాలు నూరుకొనే తగాదాలు తారస్థాయికి చేరుతున్నాయి. పార్టీ నాయకత్వం సత్వరమే రంగంలోకి దిగి, తగు విధంగా సమీక్షించుకొని పార్టీని చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉంది.

# తేజేశ్వర్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు, ఊహించని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఈ కేసులో ప్రధాని నిందితుడైన బ్యాంక్ మేనేజర్ తిరుమల రావును పోలీసులు బుధవారం శంషాబాద్ ఎయిర్‌ఫోర్ట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గద్వేల్‌కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్‌ను పెళ్లైన నెల రోజులలోపే భార్య ఏకంగా ఐదు సార్లు హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఫైనల్‌గా ఆరోసారి ఆమె అనుకున్నది సాధించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తేజేశ్వర్ భార్య ఐశ్వర్య.. నెల రోజుల క్రితం తేజేశ్వర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. కానీ, అంతకంటే ముందు ఐశ్వర్యకు కర్నూల్‌లోని ఓ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న తిరుమలరావు అనే వ్యక్తితో సంబంధం ఉంది. తిరుమలరావు పనిచేసే బ్యాంక్‌లో ఐశ్వర్య తల్లి పనిచేసేది. ఈ క్రమంలోనే ఆమెకు, బ్యాంక్ మేనేజర్ తిరుమల రావుకు శారీరక సంబంధం ఏర్పడింది. ఆ తర్వాత తిరుమలరావుకు ఐశ్వర్యతో కూడా పరిచయం అయింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. తిరుమల రావుకి అప్పటికే వివాహం అయినా అతనికి పిల్లలు లేరు. దీంతో.. ఐశ్వర్యను రెండో వివాహం చేసుకోవాలని తిరుమలరావు భావించాడు. అందుకే ఐశ్వర్య కూడా ఒప్పుకుంది. ఇలా ఏకకాలంలో తల్లీ కూతుళ్లతో తిరుమలరావు సంబంధం కొనసాగించాడు. కానీ, గద్వేల్‌కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్‌ను ఐశ్వర్య పెళ్లి చేసుకుంది. కానీ పెళ్లైన కొన్ని రోజులకే తిరుమలరావుతో ఐశ్వర్య మళ్లీ టచ్‌లోకి వెళ్లింది. ఎలాగైనా తేజేశ్వర్‌ను వదిలించుకొని నీతో వచ్చేస్తానంటూ అతనికి చెప్పింది. దీంతో తిరుమలరావు, ఐశ్వర్య కలిసి తేజేశ్వర్ హత్యకు ప్లాన్ వేశారు. తిరుమలరావు తేజేశ్వర్‌ను హత్య చేసేందుకు కొంత మందికి 75 వేల సుపారీ ఇచ్చాడు. అతడి వద్ద డబ్బు తీసుకున్నవారిలో ప్రధాన నిందితుడైన మనోజ్ అనే వ్యక్తి. తేజేశ్వర్ సర్వేయర్ కావడంతో సర్వే పేరుతో అతణ్ని బయటకు తీసుకెళ్లాడు. ఈనెల 17న తేజేశ్వర్ ను ల్యాండ్ సర్వే పేరుతో నగేష్, పరశు రాం, రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఇంట్లోంచి బయటకు పిలిచారు. కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. ముందు సీట్లో కూర్చున్న తేజేశ్వర్ మెడ పట్టుకొని రాజు, పరశురామ్ కత్తితో పొడిచారని తెలిపారు పోలీసులు. ఆ తరువాత డ్రైవర్ సీట్లో ఉన్న నగేష్ తేజేశ్వర్ కడుపులో కత్తితో పొడిచాడన్నారు. చనిపోయిన



తరువాత కర్నూలు శివారులో మృతదేహాన్ని పడేశారు. డెడ్‌బాడీని చూసిన తరువాత సుపారీ బ్యాచ్ కి రూ.2లక్షలు ఇచ్చాడు తిరుమలరావు. మర్డర్‌కు ముందు బ్యాంక్ నుంచి తిరుమలరావు రూ.20 లక్షల లోన్ తీసుకున్నాడు. ఆ హత్య తరువాత ఐశ్వర్యతో కలిసి లడఖ్ వెళ్లేందుకు తిరుమలరావు ప్లాన్ వేసుకున్నాడు. అయితే తేజేశ్వర్ కనిపించడం లేదంటూ అతని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని.. తేజేశ్వర్ ఫోన్ లోకేషన్ ఆధారంగా గద్వేల్ పోలీసులు కర్నూల్‌కు వెళ్లి ఓ చెరువు వద్ద తేజేశ్వర్ మృతదేహాన్ని కనిపెట్టారు. మృతదేహంపై అమ్మ అనే పచ్చబొట్టు ఆధారంగా అది తేజేశ్వర్ మృతదేహంగా నిర్ధారించారు.

## డ్రగ్ కేసులో మాజీ మంత్రి అరెస్టు

పంజాబ్, పంజాబ్ రాష్ట్రానికి సంబంధించిన 2021 నాటి డ్రగ్స్ కేసులో శిరోమణి అకాలీదళ్ సీనియర్ నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీతియా అరెస్టయినట్లు తెలుస్తోంది. బుధవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు అమృత్‌సర్‌లోని మజీతియా నివాసంలో ఆకస్మిక సోదాలు చేశారు. విక్రమ్ మజీతియా శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు సొంత బావ. ఆయన గతంలో పంజాబ్ రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య గనీవే కౌర్ మజీతియా ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021 నాటి డ్రగ్స్ కేసులో విక్రమ్ మజీతియా నిందితుడిగా ఉన్నారు.

## యువతకు ఆర్యజనని మంచి అవకాశం

హైదరాబాద్, దివ్యమైన సంతానం కోరుకునే దంపతులకు రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మార్గనిర్దేశం చేస్తున్న ఆర్య జనని యువతకు స్కాలర్ షిప్పులు అందించేందుకు మరోసారి ముందుకు వచ్చింది. ఇందుకోసం18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులకు జాతీయస్థాయి ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనుంది. స్వామి వివేకానంద ప్రాక్టికల్ వేదాంత, జ్ఞాన యోగ ప్రసంగాల ఆధారంగా రూపొందించిన నాలెడ్జ్ స్ట్రెంత్ అనే పుస్తకంపై టెస్ట్ నిర్వహించనుంది. మాక్ టెస్ట్ జూలై 20న జరగనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్యజనని వెబ్సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డాక్టర్ అనుపమ రెడ్డి తెలిపారు. మెయిన్ క్విజ్ ఆగస్టు మూడున జరగనుంది. విజేతలైన 150 మంది యువతీ యువకులకు ఆకర్షణీయ స్కాలర్షిప్పులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8977863881 నెంబర్ కు వాట్సాప్ చేయాలని సూచించారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం లోని వివేకానంద హెల్త్ సెంటర్‌లో సేవలందిస్తున్న ప్రత్యేక వైద్యుల బృందం 2018 సంవత్సరంలో ఆర్యజనని ప్రారంభించింది. అనేక మంది ఉత్సాహవంతులైన, సేవాభావతత్పరులైన వైద్యులు, యోగా నిపుణులు, క్లినికల్ సైకాలజిస్టులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, గాయకులు ఆర్యజనని బృందంలో ఉన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా గత 5 సంవత్సరాలుగా, ఆర్యజనని సంస్థ, కాబోయే తల్లి తండ్రులకు "స్పృహతో కూడిన గర్భధారణ, పేరెంటింగ్" గురించి అవగాహన కల్పించే విధంగా ఆఫ్ లైన్, ఆన్ లైన్ వర్క్ షాప్ లు నిర్వహిస్తోంది. ఇది గర్భిణీ స్త్రీలు, వారి శిశువుల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన కార్యక్రమం. యోగా, ధ్యానం, బేబీ బాండింగ్ టెక్నిక్స్, ఆత్మీయ గానం, ప్రెగ్నెన్సీ లైఫ్ స్టైల్ తదితర అంశాలతో కూడిన ఈ 3గంటల వర్క్ షాప్ ఆధ్యాత్మికత, ఆధునిక విజ్ఞానంతో కూడిన అద్భుతమైన మేళవింపు. కడుపులో పెరుగుతున్న శిశువు యొక్క శారీరక, భావోద్వేగ, మేధోపరమైన, ఆధ్యాత్మిక ఉన్నతికి ఈ వర్క్ షాప్ ఎంతో ఉపయోగపడుతుంది.

## రాయదుర్గంలో యువతి అనుమానాస్పద మృతి

హైదరాబాద్, రాయదుర్గంలో ఓ యువతి ఓయో హెూటల్లో యువతి సూసైడ్ చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... నల్లగండ్లలో నివాసం ఉంటున్న అనూష (26) బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. అనూషకు పెళ్లి జరిగినప్పటికీ భర్తతో విభేదాలు తలెత్తాయి. దీంతో భర్త నుంచి విడిపోయిన యువతి.. తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. వారిని చూసుకుంటూ బ్యూటీషియన్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈనెల 22న సాయంత్రం ఆరు గంటల సమయంలో స్నేహితుల వద్దకు వెళుతున్నట్లు యువతి తల్లిదండ్రులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. అయితే రాత్రి గడిచినప్పటికీ అనూష ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెకు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో యువతి కోసం గాలించడం మొదలుపెట్టారు. బంధువులను ఫోన్ చేసి అనూష గురించి ఆరా తీశారు. అయితే ఎవరూ రాలేదని చెప్పడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే రాయదుర్గంలోని క్యాబిన్ ఓయో లాడ్జలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది అనూష. ఈ విషయాన్ని ఓయో లాడ్జ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా... వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే అనూష ఎందుకు సూసైడ్ చేసుకుందనే విషయం తెలియాల్సి ఉంది. యువతి మృతి విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందించారు పోలీసులు. కానీ యువతి ఆత్మహత్యపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అసలు యువతి లాడ్జకు ఎందుకు వచ్చింది.. యువతితో పాటు ఎవరైనా వచ్చారా.. ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి.. యువతిది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఏం సాధించారు?

టెహ్రాన్:మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో 12 రోజుల పాటు నడిచిన యుద్ధం ప్రస్తుతానికి కాల్పుల విరమణతో ఆగిపోయింది. ప్రస్తుతానికి ప్రపంచదేశాలన్నీ ఊపిరిపీల్చుకున్నాయి. ఇరాన్ అణు స్థావరాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో దాడులు చేయడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. ఇరాన్ కూడా తగిన విధంగా డ్రోన్లతో ఇజ్రాయెల్ నగరాలపై విరుచుకుపడింది. ఇరు వైపులా వందల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. ఇది చాలాదన్నట్లు అమెరికా కూడా "ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్" పేరుతో భారీ బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్ అణు కేంద్రాలపై దాడలు చేసింది. అమెరికా దాడిని ప్రపంచదేశాలన్నీ తప్పు బట్టాయి. ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తి విరుద్ధమని విమర్శించాయి. రష్యా అయితే తమ అణుబాంబులు ఇరాన్ కు అందిస్తామని పరోక్షంగా వ్యాఖ్యలు చేసింది. కానీ ఇరాన్ ఖతార్ లోని అమెరికా ఎయిర్ బేస్ పై బాలిస్టిక్ మిసైల్స్ తో దాడులు చేయడంతో సీన్ మొత్తం మారిపోయింది. దీంతో ఈ యుద్ధం ఇక గల్ఫ్ దేశాలన్నింటికీ వ్యాపిస్తుందని భయపడుతున్న వేళ. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ యుద్ధం ఆపేస్తున్నాం అని చెప్పి.. కాల్పుల విరమణ ప్రకటించారు. అయితే ఇదంతా జరిగాక.. ఇప్పుడు ఈ మూడు దేశాలు గెలుపు మాదే నంటే కాదు మేము విజయం సాధించామని ప్రకటనలు చేస్తున్నాయి. నిజానికి ఈ యుద్ధంలో ఏ దేశం ఏం సాధించింది? అనే ప్రశ్న తలెత్తుతుంది.

### మూడు దేశాల విజయ ప్రకటనలు

యుద్ధంలో ఈ విరామంతో.. అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మూడు దేశాలు ఇది తాము సాధించిన విజయంగా చెప్పుకుంటున్నాయి. ఇరాన్ యొక్క అణు సామర్థ్యాన్ని బలహీనపరిచినట్లు అమెరికా చెప్పుకుంటోంది. ఇరాన్‌ను గణనీయంగా బలహీనపరిచినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు ఇరాన్ నాయకులు కూడా ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశమైన అమెరికాని ఎదిరించి నిలబడ్డామని చెప్పుకుంటోంది. ఈ మూడు దేశాలు తమ ప్రజలను ఒప్పించడానికి ఇదే ప్రచారాన్ని ఉపయోగిస్తున్నాయి.

### అమెరికా ఏం సాధించింది?

అమెరికా ఎప్పుడూ ఇరాన్, ఇజ్రాయెల్ సంఘర్షణకు దౌత్యపరమైన పరిష్కారాన్ని సమర్థించింది. కానీ ఆదివారం.. దాని B-2 బాంబర్లు ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై దాడి చేశాయి. ట్రంప్ ఇరాన్‌ను "మధ్యప్రాచ్యంలో బెదిరింపు శక్తి" అని పిలిచి, శాంతిని కోరకపోతే మరింత దాడులు ఉంటాయని హెచ్చరించారు. అయితే, ఇరాన్ ఖతార్‌లోని అమెరికా మిలిటరీ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన తర్వాత, ట్రంప్ దాడి చేయకూడదని నిర్ణయించారు. ఎందుకంటే ఇరాన్ ముందుగా హెచ్చరిక ఇచ్చింది. ఈ దాడిలో అమెరికన్లు గాయపడలేదు, కనుక ట్రంప్ శాంతి స్థాపకుడిగా కనిపించారు.

### ఇజ్రాయెల్ సాధించిన విజయం

అమెరికా దాడులకు ముందు, ఇజ్రాయెల్.. ఇరాన్ యొక్క అణు, సైనిక లక్ష్యాలపై దాడులు చేసి, ఇరాన్ యొక్క వైమానిక రక్షణ వ్యవస్థలను నాశనం చేసింది. అంతేకాకుండా ఇరాన్ కు చెందిన ముఖ్య సైనిక నాయకులను ఇజ్రాయెల్ హతమార్చింది. అమెరికా దాడులు ఇజ్రాయెల్‌కు పెద్ద లాభాన్ని చేకూర్చాయి.

# జూబ్లీహిల్స్ బై పోల్ లో గెలుపు వారిదే ...



హైదరాబాద్,జూబ్లీహిల్స్ లో ఉప ఎన్నికకు ప్రధాన పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. సీఎం రేవంత్ సైతం పార్టీ సమావేశంలో బై పోల్ పైన దిశా నిర్దేశం చేసారు. అభ్యర్ధి ఎవరనేది హైకమాండ్ నిర్ణయిస్తుంద ని తేల్చి చెప్పారు. ఎవరికి వారు తామే అభ్యర్దిగా ప్రకటించుకోవద్దని స్పష్టం చేసారు. బీఆర్ఎస్ కు ఈ ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. బీజేపీ తమ మిత్రపక్షాలతో ఈ ఎన్నిక పైన చర్చలు చేస్తోంది. ఇక, తాజాగా ఈ బై పోల్ పైన ఒక ప్రధాన పార్టీ సర్వే చేయించగా.. అందులో ఆసక్తి కర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

మారుతున్న లెక్కలు

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ బై పోల్ అనివార్యంగా మారింది. ఈ సీటును తిరిగి దక్కించుకో వటం బీఆర్ఎస్ కు ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. కాంగ్రెస్ సైతం ఈ సీటు పైన ఆశలు పెంచుకుంటోంది. గ్రేటర్ పరిధిలో 2023 ఎన్నికల్లో ఒక్క సీటు గెలవ లేక పోయిన కాంగ్రెస్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు ను కైవసం చేసుకుంది. ఇప్పుడు అదే తరహాలో జూబ్లీహిల్స్ ను గెలుచుకోవాలని భావిస్తోంది. కాగా, ఇక్కడ సామాజిక సమీకరణాల్లో భాగంగా ఎంఐఎం పాత్ర కీలకంగా మారుతోంది. ఎంఐఎం పోటీ చేస్తుందా లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే అజాహరుద్దీన్ తానే పోటీ చేస్తానని ప్రకటించారు. కాగా.. రేవంత్ మాత్రం అభ్యర్ధిని పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు.

బీఆర్ఎస్ కసరత్తు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం బీఆర్ఎస్ కసరత్తు మొదలు పెట్టింది. తమ పార్టీ నుంచి రెండు సార్లు విజయం సాధించిన గోపీనాథ్ కుటుంబానికి సీటు ఇవ్వాలని భావిస్తోంది. నియోజకవర్గం లో పబ్లిక్ పల్స్ పైన ఒక ప్రధాన పార్టీ సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపాలనేది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది. అయితే, గోపీనాథ్ కుటుంబ సభ్యులు ఈ అంశం పైన ఇంకా నిర్ణయానికి రాలేద ని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. సునీత బరిలోకి దిగటానికి అంగీరించకుంటే విష్ణు వర్ధన్ రెడ్డికి సీటు ఇస్తే ఫలితం ఎలా ఉంటుందని బీఆర్ఎస్ ఆలోచన చేస్తుంది. కాగా, సర్వేలో నియోజక వర్గ ప్రజల మూడ్ తెలుసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మాగంటి కుటుంబ సభ్యులకే సీటు ఇస్తేనే బీఆర్ఎస్ కు కలిసి వచ్చే పరిస్థితి ఉన్నట్లు సర్వే సంస్థల సమాచారం. కాగా, ఎంఐఎం సహకారం ఏ రూపంలో కాంగ్రెస్ కు అందినా... అధికార పార్టీకి సీటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేల్చినట్లు తెలుస్తోంది.

గెలుపు ప్రతిష్ఠాత్మకం

ఇక్కడ గెలుపు సిట్టింగ్ సీటు కావటంతో బీఆర్ఎస్ ... అధికారంలో ఉండటంతో కాంగ్రెస్ కు ప్రతిష్ఠా త్మకంగా మారుతోంది. ఇదే సమయంలో బీజేపీ నుంచి ఒక పారిశ్రామిక వేత్త పేరు ప్రముఖంగా ఈ సీటు కోసం వినిపిస్తోంది. కాగా, టీడీపీ.. జనసేన నుంచి మద్దతుతో మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్ధి ని బరిలోకి దించాలనేది కమలం పార్టీ నేతల ఆలోచనగా ఉందని చెబుతున్నారు. ఈ పార్టీలు ఇప్పటికే సర్వేలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగే అవకా శం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే, సర్వే నివేదికల్లో మాత్రం ఏ పార్టీకి ఏకపక్షంగా లేదనే విషయం స్పష్టం అవుతోంది. ఎంఐఎం సహకారం.. ప్రధాన పార్టీలు అభ్యర్దుల ఖరారు తరువాత పరిస్థితుల్లో మార్పు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో, జూబ్లీహిల్స్ బై పోల్ ఇప్పుడు రాజకీయంగా ఉత్కంఠతను పెంచుతోంది.

# తమిళ ఎఫెక్ట్... పవన్ కి వరస కౌంటర్లు



అమరావతి,తమిళనాడు మధురైలో తాజాగా నిర్వహించిన మురుగన్ మహా భక్తి సమ్మేళనానికి జనసేన అధినేత హెూదాలో కాకుండా మురుగన్ భక్తుడిగా కూడా పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఆయన ఆ సభలో చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆలోచింపచేశాయి. సూడో సెక్యులరిస్టులు అన్న ఆయన విమర్శలు నిజంగా తగలాల్సిన వారికి తగిలాయి. ఇంతకీ పవన్ ఏమన్నారు ఆయన మీద ఎందుకు విమర్శలు చేస్తున్నారు అన్నది కనుక ఆలోచిస్తే చాలా విషయాలే తోస్తాయి. వేరే మతాల వారు తమ దేవుడిని ఆరాధించుకుంటే లేని ఇబ్బంది హిందువులు తమ దేవీ దేవతలను ఆరాధిస్తేనే ఎందుకు వస్తుంది అన్నది పవన్ సూటి ప్రశ్న. హిందువుల మీదనే ఎందుకు ఆంక్షలు వారి మీదనే ఎందుకు విమర్శలు అన్నది కూడా ఆయన నిలదీశారు. సూడో సెక్యులరిస్టులతోనే ఇదంతా వస్తోంది అని కూడా ఆయన అన్నారు. అంతే కాదు సనాతన ధర్మం గొప్పతనం గురించి కూడా ఆయన విడమరచి చెప్పారు. బీజేపీ తప్ప మరో పార్టీకి చెందిన నాయకుడు ఎపుడూ ఇంతలా చెప్పి ఉండలేదు. అంతే కాదు పవన్ లాంటి చరిష్మాటిక్ లీడర్ నోటి వెంట సనాతన ధర్మం పరిరక్షణ గురించి వస్తే ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రత్యర్ధులు భయపడుతున్నారు అని అంటున్నారు. అంతే కాదు ఆస్తికత్వం మీద పవన్ మాట్లాడుతూంటే నాస్తికత్వం మీద మక్కువ పెంచుకున్న వారికి ఆగ్రహం వస్తోంది అని కూడా అంటున్నారు. ఇదిలా ఉంటే మధురైలో బ్రహ్మాండంగా జరిగిన మురుగన్ భక్తి సమ్మేళనం లో పవన్ ఫుల్ ఎట్రాక్షన్ అయ్యారు. ఆయన స్పీచ్ కి మంచి స్పందన లభించింది. అంతే కాదు ఆయన ఏ ఆధ్యాత్మికవేత్తకు తీసిపోని విధంగా అద్భుతమైన ప్రసంగం ఇచ్చారు. దాంతో అసలే ఆధ్యాత్మిక ఆలయాల నిలయంగా ఉన్న తమిళనాడులో అతి పెద్ద చర్చగా ఇది మారుతోంది. ఇక రాజకీయ వర్గాలలో కూడా ప్రకంపనలు చెలరేగుతున్నాయి. ఎపుడూ హిందూత్వం సనాతన ధర్మం గురించి మాట్లాడే బీజేపీ నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వస్తే దాని ప్రభావం పెద్దగా ఉండదు. పవన్ లాంటి నాయకుడి నోట ఈ మాటలు రావడంతోనే తమిళనాడు రాజకీయమే కాదు నాస్తికవాదాన్ని నిండా నింపుకున్న వారు సైతం కలవరపడే పరిస్థితి ఏర్పడుతోంది. మరో వైపు చూస్తే తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే అయితే పవన్ మీద నిప్పులు చెరుగుతోంది. ఆయన ఎవరు తమను ప్రశ్నించడానికి అని కూడా ఫైర్ అవుతోంది. ఇపుడు డీఎంకేకు మద్దతుగా తమిళ సినీ నటుడు సత్యరాజ్ సీన్ లోకి వచ్చారు. ఆయన ఏకంగా పవన్ కే హెచ్చరికలు జారీ చేస్తునారు. దేవుడు పేరుతో రాజకీయాలు చూస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. మతాన్ని అడ్డుపెట్టుకుని ఓట్ల పంట పండించుకుందామంటే కుదిరేది కాదని తమిళ గడ్డ మీద అసలు కుదరదని ఆయన చెప్పడం విశేషం. ఇక పవన్ మురుగన్ భక్తి సమ్మేళనన్ లో నాస్తికులపైన కూడా కొన్ని వ్యాఖ్యలు చేశారు. నాస్తికులకు ఏ దేవుడినీ నమ్మాల్సిన అవసరం లేదు, కానీ మన దేశంలో సమస్య ఏమిటంటే నాస్తికులు హిందువులను ఎంచుకుని లక్ష్యంగా చేసుకుంటున్నారు అంటూ పవన్ వ్యాఖ్యానించారు. దాంతో పవన్ మీద వరస కౌంటర్లు వేస్తున్నారు. నిజం చెప్పాలంటే పవన్ వ్యాఖ్యలు తమిళనాట పెద్ద ఎత్తున చర్చనీయాంశం అవుతున్నాయి. ఈ క్రమంలోనే సత్యరాజ్ సీన్ లోకి వచ్చారు. పెరియార్ సిద్ధాంతాలను నమ్మిన తమిళనాడు ప్రజలకు మీరు మోసం చేయలేరు అని పవన్ ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు మురుగన్ సభతో మోసం చేశామని అనుకుంటే అది మీ తెలివి తక్కువతనం అవుతుందని కూడా ఆయన అన్నారు. తమిళనాడు ప్రజలు చాలా తెలివైన వారు అని దేవుడి పేరుతో చేసిన వ్యాఖ్యలను తమిళ ప్రజలను తిప్పికొడతారని ఆయన ఘాటైన కామెంట్స్ చేశారు. మొత్తం మీద తమిళనాడు రాజకీయాల్లో పవన్ ఎఫెక్ట్ బలంగానే ఉందని అంటున్నారు. జస్ట్ పవన్ ఇంట్రడక్షన్ సీనే ఇలా ఉంటే రానున్న రోజులలో పవన్ తమిళనాడులో విస్తృతంగా పర్యటిస్తే ఎలా ఉంటుందో అన్న చర్చ మొదలైంది.

# తెలంగాణకు ఆమ్రపాలి మళ్లీ రాక, స్మితా సబర్వాల్‌కు మాటేంటి?

హైదరాబాద్,కోరిక బలంగా ఉండాలేగానీ కచ్చితంగా నెరవేరుతోంది. ఐఏఎస్ ఆమ్రపాలి విషయంలో అదే జరిగింది. కొద్దిరోజుల కిందట తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లిపోయారు. తాజాగా క్యాట్ తీర్పుతో ఆమె తెలంగాణకు రానున్నారు. ఇప్పుడు ఆమెకు ఎలాంటి పదవి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్-క్యాట్ ఆదేశాల మేరకు తెలంగాణలో రీఎంట్రీ ఇవ్వనున్నారు ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి. ఆమెని తెలంగాణ క్యాడర్ సర్వీసులోకి తీసుకోవాలని ఆదేశిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఏపీలో పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఎండీగా ఆమె పని చేస్తున్నారు. ఆమెను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలంటూ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది కేంద్రం. ఏపీ విభజన నేపథ్యంలో ఏపీ క్యాడర్‌కు కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని సవాల్ క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు ఆమ్రపాలి. దీనిపై ఇద్దరు సభ్యులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. మంగళవారం తీర్పు వెల్లడించింది. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేస్తూ మరి కొందరికి సడలింపు ఇవ్వడాన్ని ఈ సందర్భంగా తప్పుబట్టింది క్యాట్. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నది ఆమ్రపాలి వాదన. పరస్పర బదిలీకి సంబంధించి ఒక్కొక్కరికి ఒక్కోలా నిబంధనలు అమలు చేయడం సరికాదన్న ఆమె వాదనతో ఏకీభవించింది. చివరకు ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ ఇటీవల జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. ఆమెను తెలంగాణకు కేటాయించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది కేంద్రం. తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లే ముందు ఆమె జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పని చేశారు.




మళ్లీ ఆమెని అదే పోస్టు కేటాయిస్తారా? లేకుంటే ఏపీ మాదిరిగా టూరిజం విభాగం అప్పగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు అధికారులు. త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. మూసీ ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ఆమెకు జీహెచ్ఎంసీ కమిషనర్ పదవి ఇవ్వవచ్చని అంటున్నారు. విధుల నిర్వహణలో ఆమ్రపాలి ముక్కుసూటిగా ఉంటారనే పేరు ఉంది. ఆమ్రపాలి రానుండడంతో సీనియర్ ఐఏఎస్ స్మిత సబర్వాల్‌కు గట్టి పోటీ ఉంటుందని చర్చించుకుంటున్నారు కొందరు అధికారులు. కొన్నాళ్లు కిందట టూరిజం శాఖలో స్మితా సబర్వాల్ విధులు నిర్వహించారు. అనుకోని కారణాల వల్ల మరో విభాగానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఆమ్రపాలి రానుండడంతో ఆమెకు ప్రయార్టీ తగ్గే అవకాశముందని చర్చించుకుంటున్నారు.

# భూభారం భుజానికి ఎత్తుకున్న బాబు



అమరావతి,అమరావతి రాజధాని కోసం మరో 44 వేల ఎకరాలను భూసేకరణ చేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఆమోదముద్ర వేశారు. అంటే గుంటూరు పరిసరాలలో ఉన్న మరో 44 వేల భూమి కూడా సీఆర్డీఏ పరిధిలోకి వస్తుంది అన్న మాట. రాజధాని కోసం ఈ భూమిని తీసుకుని అందులో మౌలిక సదుపాయాల కోసమే ఏకంగా పది నుంచి పదిహేను వేల ఎకరాలు వాడుతారు అని అంటున్నారు. అంటే అందులోనే అంతర్జాతీయ విమానాశ్రయం, అలాగే రైల్వే లైన్స్ వంటివి ఉంటాయని అంటున్నారు. ఇక మిగిలిన భూమిని అభివృద్ధి చేసి భూమి యజమానులకు ఇస్తారు అని అంటున్నారు. అయితే ఈ భూమి సేకరణ అన్నది బృహత్తరమైన కార్యక్రమం అని అంటున్నారు. ఇప్పటికే 33 వేల ఎకరాలా భూమిని ఏకంగా పది పన్నెండు ఏళ్ళ క్రితం ప్రభుత్వం తీసుకుంది. అమరావతి రూపూ రేఖా లేకపోవడంతో ఈ రోజుకీ వారు ఆశలతో ఎదురుచూస్తున్నారు. మరో వైపు చూస్తే కనుక అమరావతి రాజధాని పునర్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇప్పటికి 30 వేల కోట్ల రూపాయల ఆర్థిక నిధులను సేకరించారు. రానున్న రోజులలో ఇంతకు ఇంతా రుణాలని తెచ్చి అమరావతి రాజధాని మొదటి దశ పనులౌ 2027 నాటికి పూర్తి చేయాలని ఒక లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ పనులే భారంగా ఉంటే ఇపుడు ఇన్ని వేల ఎకరాలను సేకరించడం న్యాయమేనా మంచిదేనా సమంజసమేనా అన్న చర్చ అయితే వస్తోంది. అమరావతి రాజధాని పేరుతో భారీ కాన్వాస్ మీదనే డిజైన్లు స్టార్ట్ చేశారు అని దానికి శక్తికి మించి పరుగులు పెడుతూంటే ఇపుడు 44 వేల ఎకరాలు తీసుకోవడం వల్ల మరింత భారం ఉండదా అంటే అక్కడ ఉన్నది చంద్రబాబునాయుడు అని ఆయన విజనరీ అని అమరావతి మరింత భారీ కాన్వాస్ మీద ఇంతకు ఇంతా అద్భుతంగా వస్తుందని అంటున్నారు. అయితే కాలం ఎపుడు వేగంతో ఉంటుంది. అది గిర్రున తిరిగేస్తుంది ఫలితాలు వచ్చేలోగా క్యాలెండర్ లో ఏడాదులు అలా కరిగిపోతాయి. జనాలకు చూస్తే తమకు కళ్ళ ముందు అంతా చూపించమంటారు. కాదూ కూడదు అంటే వారు తీవ్ర అసంతృప్తికి లోను అవుతారు. దాంతో ఈ వేల ఎకరాల సేకరణ అనుకున్నట్లుగా సాగి రిజల్ట్ ఇస్తే ఓకే కానీ లేకపోయినా ఏమైనా ఇబ్బందులు వచ్చినా అన్న బెంగా చింతా కూడా మరో వైపు ఉన్నాయని అంటున్నారు. ఇక సింపుల్ గా చెప్పుకోవాలంటే 33 వేల ఎకరాలు భూసేకరణలో తీసుకుంది. ఆ మీదట ప్రభుత్వ భూములు చూస్తే మరో పాతిక వేల ఎకరాలు ఉన్నాయని చెబుతున్నారు దాంతో 58 వేల ఎకరాలు అక్కడికే అయింది అని ఇపుడు 44 వేల ఎకరాలు అంటే లక్ష ఎకరాలతో రాజధాని ఏర్పాటు చేయడమా అన్న వారూ ఉన్నారు. పైగా అన్నీ పంట భూములే అన్నీ సారవంతమైన భూములే. అన్నీ కూడా పచ్చని భూములే తేడా వస్తే ఉన్న ఉపాధి కూడా ఇబ్బందిలో పడుతుంది కదా అన్న చర్చ కూడా ఉంది. ఇక టీడీపీ సీనియర్ నేత మాజీ ఎంపీ వడ్డే శోభనాదీశ్వరరావు అయితే ఈ భూముల పిచ్చి ఏమిటి చంద్రబాబూ అని మీడియా ముఖంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు పైగా ముక్కారు పంటలు పండే భూములు అన్నీ అని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు చూస్తే ప్రభుత్వం అడిగినా భూములు ఇవ్వవద్దు అని రైతులకు పిలుపు ఇచ్చారు. మరి ఈ భూభారం అంతా తాను మోస్తాను అని బాబు ముందుకు వస్తే కాదనే రైతులు ఉంటారా అన్నదే చర్చ. ఏది ఏమైనా బాబు అమరావతి రాజధాని విషయంలో పెద్ద కలలే కంటున్నారు. అవి ఫలించాలని ఆయనతో పాటు అంతా కోరుకోవాలి. ఎందుకంటే అమరావతితో పాటే ఆంధ్రుల మొత్తం భవిష్యత్తు ఆధారపడి ఉంది అన్నది సుస్పష్టం కాబట్టి.

# విశాఖపట్నంలో కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్




విశాఖపట్నం : టెక్నాలజీ-ప్రొఫెషనల్ సేవలలో ప్రపంచ అగ్రగామి సంస్థ అయిన కాగ్నిజెంట్ (నాస్‌డాక్: సిటిఎస్ హెచ్), ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో అత్యాధునిక క్యాంపస్‌ను అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశంలో కార్యకలాపాలను భారీగా విస్తరించనున్నట్లు తెలుపుతూ తమ ప్రణాళికలను నేడు వెల్లడించింది. ప్రతిపాదిత క్యాంపస్‌ను కాపులుప్పాడలోని ఐటి హిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన 22 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. రూ. 1,583 కోట్ల పెట్టుబడితో, ఈ క్యాంపస్‌ను మూడు దశల్లో అభివృద్ధి చేస్తారు, 8,000 కంటే ఎక్కువ ఉపాధి అవకాశాలను దీనిద్వారా సృష్టించనున్నారు ప్రపంచవ్యాప్తంగా క్లయింట్‌లకు ఏఐ మరియు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డెలివరీలో కాగ్నిజెంట్ యొక్క అధునాతన సామర్థ్యాలను మరింతగా అందించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం పొందిన తర్వాత ఈ ప్రకటన వెలువడింది. "ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ అగ్రగామి సంస్థలకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే మా లక్ష్యంకు అనుగుణంగా కాగ్నిజెంట్‌ను విశాఖపట్నంకు స్వాగతిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము" అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ %డ% కమ్యూనికేషన్, మానవ వనరుల అభివృద్ధి మరియు ఆర్ టి జి శాఖల మంత్రి శ్రీ నారా లోకేష్ అన్నారు. "కాగ్నిజెంట్ ఇక్కడ తమ క్యాంపస్ ఏర్పాటు చేయటం ద్వారా ఈ ప్రాంత డిజిటల్ ఆర్థిక వ్యవస్థను మరింత వేగవంతం చేస్తుంది, అదే సమయంలో భవిష్యత్ శ్రామిక శక్తికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. స్మార్ట్ మౌలిక సదుపాయాలు, సులభతరమైన వ్యాపార నిర్వహణ సౌకర్యాలు , ప్రగతిశీలరీతిలో విధాన పరమైన మద్దతు అందించటం ద్వారా ఐటి మరియు ఐటీఈఎస్ రంగాలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని అన్నారు. కాగ్నిజెంట్ సంస్థ, 2026 ప్రారంభంలో విశాఖపట్నంలో 800 మంది అసోసియేట్‌లకు సీటింగ్ సామర్థ్యంతో తాత్కాలిక సౌకర్యం నుండి కార్యకలాపాలను ప్రారంభించనుంది, 2029 ప్రారంభంలో క్యాంపస్ మొదటి దశ పూర్తయ్యే వరకు ఈ తరహాలోనే ఇక్కడ కార్యకలాపాలను నిర్వహించనుంది. "మా వృద్ధి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తూ విశాఖపట్నంలో మా క్యాంపస్‌ను ప్రారంభించనున్నామని వెల్లడించేందుకు మేము సంతోషిస్తున్నాము. ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల లక్ష్యం , స్థిరమైన మద్దతు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము" అని కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ ఎస్ అన్నారు. "సాంకేతికంగా అత్యున్నత ప్రతిభావంతులతో పాటుగా విస్తృత స్థాయి మౌలిక సదుపాయాలతో, రేపటి డిజిటల్ వర్క్‌ఫోర్స్‌ను అభివృద్ధి చేయాలనే మా లక్ష్యంలో, ముఖ్యంగా భారతదేశంలోని టైర్ 2 నగరాల్లో బలమైన భాగస్వామిగా విశాఖపట్నం నిలుస్తుంది . ఈ పెట్టుబడి ద్వారా, ప్రభావవంతమైన కెరీర్ అవకాశాలను సృష్టించడం , ఈ ప్రాంతం కోసం శక్తివంతమైన, సమ్మిళిత , ఆవిష్కరణ-ఆధారిత భవిష్యత్తుకు దోహదపడాలని మేము ఎదురుచూస్తున్నాము" అని అన్నారు. 2024 నుండి, భువనేశ్వర్, ఇండోర్‌లో కొత్త డెలివరీ కేంద్రాలను, గుజరాత్‌లోని గిఫ్ట్ నగరంలో ఒక టెక్‌ఫిన్ కేంద్రాన్ని కాగ్నిజెంట్ ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలు భవిష్యత్తుకు మద్దతు ఇవ్వడానికి, చురుకుదనం, నైపుణ్యం, సహకారం, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, అత్యుత్తమ శ్రేణి ఉద్యోగి అనుభవాన్ని అందించడానికి రూపొందించబడ్డాయి. కాగ్నిజెంట్ గ్లోబల్ డెలివరీకి భారతదేశం కేంద్రంగా ఉంది, దాని 336,300 మంది అసోసియేట్‌లలో 70% కంటే ఎక్కువ మంది భారతదేశంలోనే ఉన్నారు. విశాఖపట్నం విస్తరణ బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, కోయంబత్తూర్, ఢిల్లీ-ఎన్ సి ఆర్ , గిఫ్ట్ సిటీ, హైదరాబాద్, ఇండోర్, కొచ్చి, కోల్‌కతా, మంగళూరు, ముంబై మరియు పూణేలలో కాగ్నిజెంట్ యొక్క బలమైన కార్యాచరణ ఉనికిపై నిర్మించబడింది.

## రైతు భరోసా ఎందుకు సంబరాలు : డీకే అరుణ

హైదరాబాద్,స్థానిక సంస్థలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కి లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. రెండు ఎకరాలు ఉన్నవారికి కూడా రైతు భరోసా ఇంకా రాలేదని.. అలాంటప్పుడు రైతు భరోసా పేరుతో సంబురాలు ఎందుకు చేసుకుంటున్నారో కాంగ్రెస్ నేతలకే తెలియదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీజేపీ నాయకులందరూ బాధితులేనని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

# బాబు కోసం ...జగన్ భారీ యాక్షన్ ప్లాన్



అమరావతి,అదేంటి వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ చంద్రబాబు కోసం భారీ యాక్షన్ ప్లాన్ ని ఎందుకు చేస్తారు అన్న డౌట్ ఎవరికైనా రావచ్చు. అయితే బాబు కోసం అంటే బాబు పాలన మీద పూర్తి వ్యతిరేకత జనంలోకి రావడం కోసం అన్న మాట. చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం మీద జగన్ అతి పెద్ద యుద్ధమే ప్రకటించారు. హనీమూన్ పీరియడ్ కూటమికి ముగిసింది అని ఆయన అంటున్నారు. వైసీపీ ఇచ్చిన టైం అయిపోయింది అని కూడా చెప్పేశారు. ఇక జనంలోనే తేల్చుకుంటామని అంటున్నారు. అందుకోసం ఏకంగా అయిదు వారాల పాటు ఒక భారీ ప్రోగ్రాం ని ఆయన డిజైన్ చేసి పార్టీ వారి చేతిలో పెట్టారు. ఇక మీరు ఇంటింటికీ తిరిగి జనాలలో బాబు పాలన పట్ల వ్యతిరేకత పెంచడమే పని అని నిర్దేశిస్తున్నారు. ఈ ప్రోగ్రాం కి రీకాల్ చంద్రబాబూస్ మేనిఫేస్టో అని పేరు పెట్టారు. చంద్రబాబు ఇచ్చిన 150కి పైగా హామీలతో కూడినా మానిఫేస్టోని పట్టుకుని వైసీపీ క్యాడర్ ఇక ఇంటింటికీ తిరిరి వాటి మీద జనాలకు అవగాహన కల్పిస్తుంది. ఆ మీదట ఈ మ్యానిఫేస్టోలో అంశాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది. ఇక ఈ కార్యక్రమానికి సంబంధించిన క్యూ ఆర్ కోడ్ ని కూడా జగన్ ఆవిష్కరించారు. ఆ క్యూ ఆర్ కోడ్ మొత్తం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నీ ఉంటాయి. వీటిని ప్రతీ ఇంటికి వెళ్ళి అక్కడే ఓపెన్ చేసి జనాలకే వాటి మీద అభిప్రాయ సేకరణ చేస్తారు అని అంటున్నారు. మీకు ఏ పథకం అందింది అని వాకబు చేస్తారు. అంతే కాదు గత అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్ని పథకాలు అందాయి ఇపుడు ఏడాదిలో పథకాలు అమలు కాక ఎంతటి నష్టం ఒక్కో ఇంటికీ వచ్చిందో లెక్కలతో సహా వివరిస్తారు అని అంటున్నారు. ఇక 2024 నుంచి పథకాలు బాబు ఇస్తామని చెప్పారు. ఏడాదిగా ఇవ్వలేదు, ఇపుడు అరకొరగా అమలు చేస్తున్నారు. దీని వల్ల ప్రతీ ఇంటికీ ఎంత బాకీ ఉందో పూర్తిగా జనాలకు విడమరచి చెప్పాలని కూడా జనాలకు చెప్పి వారి నుంచే బాబు మీద ఒత్తిడి పెట్టించాలని జగన్ పార్టీ నాయకులను కోరుతున్నారు. ఇక వైసీపీ టెక్నాలజీతోనే బాబుని ఎదుర్కోవాలని చూస్తోంది. ఎలా అంటే వైసీపీ తయారు చేసిన క్యూ ఆర్ కోడ్ ని ప్రతీ ఇంటికి వెళ్ళి అక్కడే స్కాన్ చేస్తే మొదట రెండు సార్లు చంద్రబాబు ఎన్నికల మేనిఫేస్టో అలాగే బాండ్లు వస్తాయి. ఇక మూడవసారి చూస్తే కనుక ఆ కుటుంబానికి పథకాలు అందక ఎంత నష్టం వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఎంత బాకీ పడింది అన్నది పూర్తి వివరాలతో వస్తుందని అంటున్నారు. ఇలా ఎక్కడికక్కడ క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేస్తూ జనాలకు తెలియ చేస్తూ ఆయా ప్రాంతాలకు కూటమి ప్రభుత్వ పాలనలో జరిగిన అన్యాయాల మీద మీడియా సమావేశాలతో పాటు స్థానికంగా సభలు సమావేశాలను కూడా వైసీపీ నేతలు ఏర్పాటు చేయాలని జగన్ సూచిస్తున్నారు. మొత్తానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కూటమి ప్రభుత్వం వైఫల్యాలను పూర్తిగా ఎండగట్టడంతో పాటు జనాలను ఇందులో మమేకం చేయడం ద్వారా పూర్తిగా రాజకీయ ప్రయోజనం పొందవచ్చునని వైసీపీ ఆలోచిస్తోంది. వైసీపీ తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమం తో మరో నెలన్నర పాటు ఏపీలో రాజకీయ మోత మోగడం ఖాయమని అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com